

స్టిక్కరే జగన్ ట్రెండ్

తల మీద స్టిక్కరే ప్రస్తుత ఎన్నికల్లో జగన్ ట్రెండ్. ఎన్నికల సమయంలో కోడి కత్తులు, గులకరాళ్ల డ్రామాతో స్టిక్కర్లు వేసుకుంటూ ఆయన కొత్త ట్రెండ్ ఫాలో అవుతున్నారు.పులివెందులలో నామినేషన్ సందర్భంగా తన జేబులో పెన్ను ఉన్నా పక్కనే ఉన్న అవినాష్ పెన్ను తీసుకొని సంతకం పెట్టడంలో ఆంతర్యమేంటో అర్థం కావడం లేదు.తన పెన్నులో ఇంకు లేదా? లేక ఆయన పెన్ను పనిచేయదా అనేది జగన్ చెప్పాలి.మీ ఇంట్లో మంచి జరిగివుంటేనే వైసీపీకి ఓటు వేయండంటున్న జగన్ ముందు తన ఇంట్లో ఏం మంచి జరిగిందో చెప్పాలి.ఆయన ఇంట్లో ఏం మంచి జరిగిందో చెల్లెల్లే చెబుతున్నారనేది జగన్ గ్రహించాలి.

- కిరణ్ రాయల్,తిరుపతి అసెంబ్లీ జనసేన ఇంచార్జి

హృదయాలయంలో గవర్నర్



బర్డ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారిని పలుకరిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 26: టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బర్డ్, శ్రీపద్మావతి హృదయాలయ ఆస్పత్రులను గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ దంపతులు శుక్రవారం సందర్శించారు.బర్డ్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కృత్రిమ అవయవాల తయారీ, అమరిక కేంద్రాన్ని పరిశీలించారు.ఆపరేషన్ థియేటర్లు, వార్డులు, స్కానింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృత్రిమ అవయవాల తయారీ, అమరికను గవర్నర్‌కు బర్డ్ ప్రత్యేకాధికారి రెడ్డెప్పరెడ్డి వివరించారు. అనంతరం హృదయాలయకు వెళ్లిన గవర్నర్.. అక్కడి వార్డుల్లో చికిత్స పొందుతున్న చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడారు. చికిత్స కోసం వచ్చిన చిన్నారులతో ముచ్చటించారు.ఆస్పత్రిలోని క్యాథ్‌ల్యాబ్, ఐసీయూ, ఓటీ థియేటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఇప్పటి వరకు చేసిన గుండె మార్పిడి శస్త్ర చికిత్సల గురించి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి వివరించారు.

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ఈనెల 18 నుంచీ 25వ తేదీ వరకూ పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలకు దాఖలైన నామినేషన్ల పరిశీలన శుక్రవారం ముగిసింది. పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు కలిపి మొత్తం 227 మంది నామినేషన్లు వేయగా అందులో 50 మంది నామినేషన్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. మిగిలిన 177 మంది నామినేషన్లను ఆమోదించారు. ఇందులో పార్లమెంటుకు 27మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా ముగ్గురివి చెల్లుబాటు కాలేదు. మిగిలిన 24మందివీ ఓకే అయ్యాయి. అలాగే జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు గానూ 200మంది అభ్యర్థులు నామినేషన్లు ఫైల్ చేయగా పరిశీలనలో 47మందివి తిరస్కరణకు గురయ్యాయి.మిగిలిన 153మంది నామినేషన్లు చెల్లుబాటవుతాయని అధికారులు ప్రకటించారు. - తిరుపతి, ఆంధ్రజ్యోతి

50నామినేషన్ల తిరస్కృతి

- 177 మంది అభ్యర్థులవి ఆమోదం
- తిరస్కరణకు గురైన వాటిలో 3 ఎంపీ ,47అసెంబ్లీ

డిపాజిట్ చెల్లించకుండా నామినేషన్

తిరుపతి పార్లమెంటు స్థానానికి ఇండిపెండెంట్ అభ్యర్థిగా డి.విజయ్ దాఖలు చేసిన నామినేషన్ తిరస్కరణకు గురైంది. పరిశీలనలో ఈయన నామినేషన్ పత్రాలతో పాటు చెల్లించాల్సిన డిపాజిట్ సొమ్ము చెల్లించకపోవడంతో నామినేషన్ చెల్లలేదు.అలాగే మరో ఇండిపెండెంట్ అభ్యర్థి కె.సుబ్బయ్య వేసిన నామినేషన్ చెల్లుబాటు కాలేదు. పరిశీలనలో పదిమంది ప్రతిపాదకులకు గానూ తొమ్మిదిమందే ప్రతిపాదించినట్టు అధికారులు గుర్తించారు. దీంతో ఆయన నామినేషన్ తిరస్కరణకు గురైంది.

స్థానం	మొత్తం అభ్యర్థులు	తిరస్కరణ	పోటీలో వున్న అభ్యర్థులు
తిరుపతి పార్లమెంటు	27	3	24
గూడూరు అసెంబ్లీ	21	6	15
సూళ్ళూరుపేట అసెంబ్లీ	16	2	14
వెంకటగిరి అసెంబ్లీ	17	7	10
చంద్రగిరి అసెంబ్లీ	43	17	26
తిరుపతి	52	4	48
శ్రీకాళహస్తి	27	4	23
సత్యవేడు	24	7	17
మొత్తం	227	50	177

వయసు సరిపోకున్నా...

గూడూరు నియోజకవర్గంలో వయసు సరిపోకున్నా ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వైసీపీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ కుమారుడు రేవంత్ చక్రవర్తి వైసీపీ తరపున నామినేషన్ వేశారు. స్క్రూటినీలో అతడి వయసు 24 ఏళ్ళని గుర్తించారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి కనీస వయసు 25ఏళ్ళు నిండి వుండాలి. దీంతో అతడి నామినేషన్ తిరస్కరణకు గురైంది. కాగా తండ్రి ఎమ్మెల్సీగా వుండి కూడా కనీస ఎన్నికల నిబంధనలు తెలియకుండా కుమారుడి చేత నామినేషన్ వేయించడం గమనార్హం. అదే నియోజకవర్గంలో కమతం కామాక్షి అనే యువతి ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశారు. పరిశీలనలో ఆ యువతి వయసు 20 ఏళ్ళని తేలింది.దీంతో ఆమె నామినేషన్‌ను కూడా తిరస్కరించారు.

ప్రతిపాదకులు లేకుండానే...

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి కుమార్తె బి.పవిత్ర వైసీపీ తరపున దాఖలు చేసిన నామినేషన్ చెల్లుబాటు కాలేదు. అధికారుల పరిశీలనలో ఆమె పది మంది ప్రతిపాదకులు లేకుండానే నామినేషన్ వేసినట్టు గుర్తించారు. దీంతో నామినేషన్‌ను తిరస్కరించారు. ప్రధాన పార్టీల తరపున అసలైన అభ్యర్థి వేసే నామినేషన్ ఏదైనా కారణాల వల్ల చెల్లుబాటు కాకుండా పోతే ప్రత్యామ్నాయ అభ్యర్థిగా కుటుంబ సభ్యులు లేదా సన్నిహిత బంధువులు నామినేషన్ వేయడం సర్వ సాధారణం. అయితే ఇక్కడ ఎమ్మెల్యే కుమార్తె అసలు ప్రతిపాదకులే లేకుండా చెల్లుబాటు కాని నామినేషన్ పత్రాలు సమర్పించడం గమనార్హం.

సంతకాలు మరిచిన ఇద్దరు అభ్యర్థులు

సత్యవేడు అసెంబ్లీకి ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ పత్రాల్లో కొన్ని చోట్ల సంతకాలు చేయడం మరిచారు. దీంతో వారిద్దరి నామినేషన్లు చెల్లుబాటు కాలేదు. సురేష్ అనే అభ్యర్థి ఫారం 26 అఫిడవిట్‌లో సంతకం చేయలేదు. అలాగే మరో ఇండిపెండెంట్ థామస్ కూడా అఫిడవిట్లలో సంతకాలు చేయలేదు.

బోగస్ ప్రపోజర్‌తో...

ఆయన నామినేషన్ వేసిందేమో నీతి నిజాయితీ పార్టీ తరపున. కానీ నామినేషన్ పత్రాలలో పేర్కొన్న ప్రతిపాదకుడేమో బోగస్. సత్యవేడు నియోజకవర్గంలో నీతి నిజాయితీ పార్టీ తరపున చిట్టిబాబు అనే వ్యక్తి నామినేషన్ వేశారు. స్క్రూటినీలో ప్రతిపాదకుడు బోగస్ అని గుర్తించిన అధికారులు నామినేషన్ను తిరస్కరించారు.

టీడీపీ కార్యకర్తలపై కేసుల నమోదు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 26: తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద గురువారం జరిగిన ఘటనలపై యూనివర్సిటీ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. నామినేషన్ల దాఖలుకు ఆఖరు రోజైన గురువారం చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని, వైసీపీ తరపున చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆర్డీవో కార్యాలయం వద్దకు ర్యాలీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యకర్తలు నినాదాలు చేస్తుండగా.. వైసీపీ కార్యకర్తలు ప్రతిగా నినాదాలు చేశారు. ఈ ఉత్సాహం అదుపు తప్పడంతో పరస్పరం ఘర్షణ పడ్డారు. రాళ్లు, జెండా కర్రలతో కొట్టుకున్నారు. పోలీసులు లాఠీచార్జి జరిపి, టీడీపీ వర్గీయులను చెదరగొట్టడంతో ఆవేశపడ్డ టీడీపీ కార్యకర్తలు అప్పుడే ఆర్డీవో కార్యాలయం నుంచి వెలుపలికి వచ్చి బయల్దేరి వెళుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి వాహనంపై దాడి చేశారు. ఈ ఘటనలపై చంద్రగిరి తహసీల్దార్ మారుతి ఫిర్యాదు మేరకు టీడీపీకి చెందిన కొంతమంది కార్యకర్తలపై యూనివర్సిటీ పోలీసులు కేసు నమోదు చేశారు.

కొత్త ఓటర్ల సంఖ్య 42,007

- జిల్లాలో 18,12,980కి పెరిగిన ఓటర్లు
- 15రోజుల్లో పెరిగిన 9,769మంది




తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 26: ఓటర్ల తుది జాబితా సిద్ధమైంది. ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఏప్రిల్ 1 నుంచి 14 వరకు ఎన్నికల సంఘం చివరి అవకాశం ఇచ్చింది.దీంతో మరో 9,769మంది ఓటర్ల జాబితాలో చేరారు.వీరిలో చంద్రగిరి నియోజకవర్గంలోనే అత్యధికంగా 1,642మంది వున్నారు.కాగా 1,330మంది కొత్తగా వయోవృద్ధులు ఓటర్లుగా నమోదు కావడం అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.జిల్లా జనాభా 25.56లక్షలు కాగా ఓటర్ల తుది జాబితా ప్రకారం జిల్లాలో ఓటర్లు 18,12,980కి చేరారు.వీరిలో పురుషులు 8,83,330మంది, మహిళలు 9,29,466మంది, ట్రాన్స్‌జెండర్స్ 184మంది, దివ్యాంగులు 24,596మంది, 85 సంవత్సరాలు దాటినవారు 7,924మంది ఉన్నారు. 18 సంవత్సరాలు నిండి మొదటిసారి ఓటువినియోగించుకోనున్న వారు 42,007మంది వున్నారు.సర్వీసు ఓటర్ల విషయానికి వస్తే 862మందిఉన్నారు.నియోజకవర్గాల వారీగా చూస్తే గూడూరులో 2,45,205మంది ఓటర్లు, సూళ్ళూరుపేటలో 2,42,610మంది, వెంకటగిరిలో 2,43,582మంది, చంద్రగిరిలో 3,15,159మంది, తిరుపతిలో 3,02,503మంది,శ్రీకాళహస్తిలో 2,48,536మంది, సత్యవేడులో 2,15,385మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో అత్యధికంగా ఓటర్లున్న నియోజకవర్గం చంద్రగిరి కావడం విశేషం.

అనుభవం, అవగాహన వున్నాయి...

ఐఏఎస్ అధికారిగా ప్రభుత్వ పాలనపై తనకు అపారమైన అనుభవం, అవగాహన వున్నాయని... ప్రజలు అవకాశమిస్తే వాటిని ఉపయోగించి నియోజకవర్గ అభివృద్ధిని అత్యున్నత స్థాయికి తీసుకెళ్ళడం ద్వారా వారి రుణం తీర్చుకుంటానని చెబుతున్నారు తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్.ప్రతిపక్షంలో వుండగానే ఎంపీగా నియోజకవర్గానికి విలువైన సేవలు అందించిన తాను ఈ పర్యాయం గెలిస్తే కేంద్ర, రాష్ట్రాల్లో ఏర్పడే ఎన్డీయే ప్రభుత్వాల అండతో తిరుపతిని అద్భుతంగా తీర్చిదిద్దుతానని ప్రజలకు మాట ఇస్తున్నారాయన. తిరుపతి ఎంపీగా, గూడూరు ఎమ్మెల్యేగా తాను చేసిన అభివృద్ధిని వివరిస్తూనే ఈ ఎన్నికల్లో గెలిస్తే పార్లమెంటు నియోజకవర్గంలో చేపట్టబోయే అభివృద్ధి గురించి తన ఆలోచనలను, అభిప్రాయాలను ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు. అవన్నీ ఆయన మాటల్లోనే...

అవకాశమిస్తే రుణం తీర్చుకుంటా!

బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్



ఇంటర్వ్యూ

తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఎంపీగా అవకాశమిస్తే మరెవ్వరూ చేయలేని రీతిలో అభివృద్ధి చేయడం ద్వారా ప్రజల రుణం తీర్చుకుంటా. ఈ ఎన్నికల్లో గెలిస్తే తిరుపతి వరల్డ్ క్లాస్ రైల్వే స్టేషన్ పనులు పూర్తి చేయిస్తా. ప్రస్తుతం అక్కడ పార్కింగ్ సదుపాయం లేదు. గతంలో నేను చేసిన ప్రతిపాదన ప్రకారం వెయ్యి వాహనాలు పార్కు చేసే సదుపాయం వుండాలి. ఆ సౌకర్యం కల్పిస్తా. ఆ ప్రాంతంలో అనేక చోట్ల సబ్‌వేల అవసరం వుంది. వాటిని ఏర్పాటు చేయిస్తా. అలాగే కొత్త సైబర్ కేఫ్, హోటల్స్, రెస్టారెంట్లు, ప్లే గ్రౌండ్‌లు పెట్టించడానికి కృషి చేస్తా. ప్లాట్ ఫామ్ విస్తరించేలా చూస్తా.ఆగిపోయిన నడికుడి- శ్రీకాళహస్తి పనులను మొదలు పెట్టించి పూర్తయ్యేలా శ్రద్ధ తీసుకుంటా. రేణిగుంట-తిరుపతి నడుమ కూడా సబ్‌వేలు పూర్తి చేయిస్తా.రేణిగుంట సీఆర్ఎస్‌ను మరింత విస్తృత పరిచేందుకు ప్రయత్నిస్తా.దానివల్ల ఉద్యోగాలు పెరుగుతాయి.తిరుపతి-రేణిగుంట నడుమ కాటన్ మిల్లును అభివృద్ధి పరిచి ఉద్యోగాలు వచ్చేలా చూస్తా.

అనేక ఇతర అభివృద్ధి పనులు చేయించా!

చరిత్ర కలిగిన రాయలచెరువుకు 76 ఏళ్ళుగా గేటు లేదు.గ్రామస్తులు సమస్య వుందని చెబితే గేట్ చేయించా. తిరుపతి సీతమ్మ నగర్‌కు ఎంపీ నిధులతో ఎలక్ట్రికల్ మెటీరియల్ మంజూరు చేయించా. స్కావెంజర్స్ కాలనీలో పేద ప్రజల నుంచీ భూమి లాక్కోకుండా కాపాడా. పేదల ఎదుగుదలకు చదువు చాలా ముఖ్యమనేది నా అభిప్రాయం. ముఖ్యంగా పేద పిల్లలు చదువుకునే సంక్షేమ హాస్టళ్ళలో పరిస్థితులు మెరుగుపడేందుకు కృషి చేశా. తరచూ హాస్టళ్ళను తనిఖీ చేశా.



సీబీఐసీతో పరిశ్రమలు రప్పిస్తా!

చెన్నై-బెంగుళూరు ఇండస్ట్రియల్ కారిడార్ ద్వారా జిల్లాకు పరిశ్రమలు రప్పించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తా. ఈ కారిడార్ వల్ల ప్రధానంగా చిల్లకూరు మండలంలో పరిశ్రమలు రావాల్సి వుంది. అలాగే చెన్నై-వైజాగ్ ఇండస్ట్రియల్ కారిడార్ కూడా జిల్లా మీదుగా వెళుతోంది. సాగరమాల కింద తీర ప్రాంతాలను కనెక్ట్ చేస్తూ రహదారులు అభివృద్ధి చెందుతాయి. దాని ద్వారా కూడా జిల్లాకు పరిశ్రమలు తేవడానికి గట్టిగా ప్రయత్నిస్తా. రెండు కారిడార్ల వల్ల వెంకటగిరి, గూడూరు, సూళ్ళూరుపేట, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో ఎక్కువగా పారిశ్రామిక వాడల ఏర్పాటుకు అవకాశాలున్నాయి. దాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నిస్తా.

పర్యాటక అభివృద్ధికి కృషి... అభయారణ్యపు ఆంక్షలు తొలగిస్తా!

తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో పర్యాటక రంగ అభివృద్ధికి విశేష అవకాశాలున్నాయి.ఐఏఎస్ అధికారిగా పర్యాటక శాఖ కమిషనర్‌గా పనిచేశా.ఆ రంగంపై అనుభవం,అవగాహన వున్నాయి. నియోజక వర్గంలో తీర ప్రాంతాలుండడం పర్యాటక రంగానికి వరంగా మారింది.వాకాడులో తూపిలి వద్ద బీచ్ టూరిజం అభివృద్ధికి అవకాశాలున్నాయి.అయితే దురదృష్టవశాత్తూ నేలపట్టు పక్షుల అభయారణ్యం వున్న కారణంగా కేంద్ర అటవీ, పర్యావరణ శాఖలు అనేక ఆంక్షలు విధించాయి. దాంతో కనీసం బీటీ రోడ్డు నిర్మించే అవకాశం కూడా లేదు. గొల్లల గాటు నుంచీ కారికేడు వరకూ రోడ్లు లేవు. అలాగే కొత్తపాలెంలోనూ రోడ్లు లేవు. నేను గతంలో ఎంపీగా వున్నపుడు రూ. 80 లక్షలతో గ్రావెల్ రోడ్డు వేయించా. మళ్ళీ గెలిస్తే వైల్డ్ లైఫ్ యాక్ట్ కింద అమలవుతున్న ఆంక్షలు ఎత్తివేయిస్తా.గ్రావెల్ రోడ్ల స్థానంలో బీటీ రోడ్లు వేయిస్తా. వాకాడు మండలం మొనపాలెం నుంచీ నవాబ్ పేట వరకూ ఆంక్షలు తీసేయించి బీటీ రోడ్లు లేదా సీసీ రోడ్లు వేయిస్తా. పర్యాటక రంగ అభివృద్ధికి కేంద్రం నుంచీ నిధులు తెప్పిస్తా.

తిరుపతిలో ప్రజాస్వామ్యం కరువైంది!

గడచిన ఐదేళ్ళుగా తిరుపతిలో ప్రజాస్వామ్యం కరువైందని విన్నా. ప్రభుత్వ ఆస్తులతో పాటు ప్రజల సొంత ఆస్తులు కూడా దౌర్జన్యంగా తీసుకుంటున్నట్టుగా తెలిసింది. ప్రజల్లో భయాందోళనలు నెలకొని వున్నాయి. ఈసారి గెలవబోయే 370 మంది బీజేపీ ఎంపీల్లో నేను కూడా వుంటానన్న నమ్మకం వుంది. నాకు చట్టం తెలుసు. పోగొట్టుకున్న భూములను తిరిగి సొంతదార్లకు అప్పగించేలా చూస్తా.

తుడా అభివృద్ధిలో అసమానతలు లేకుండా చూస్తా!

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఈ ప్రాంత అభివృద్ధికి చాలా కీలకం. అయితే తుడా పనితీరు సమగ్రంగా లేదు. కొన్ని ప్రాంతాలు ఎక్కువగా అభివృద్ధి చెందుతుంటే మరికొన్ని ప్రాంతాలను విస్మరించారు. తుడా పరిధిలోని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి పరచాల్సిన అవసరముంది. ఆ దిశగా గట్టిగా కృషి చేస్తా.

గూడూరులో బాగా పనిచేసినా టికెట్ ఇవ్వలేదు!

ఎమ్మెల్యేగా ఈ ఐదేళ్ళు గూడూరులో బ్రహ్మాండంగా పనిచేశా. గతంలో ఏ ఎమ్మెల్యే చేయనంత అభివృద్ధి చేశా. ఎలాంటి అవినీతికీ పాల్పడలేదు.అయినా టికెట్ నిరాకరించి మళ్ళీ నేను ప్రజల్లో వుండేందుకు అవకాశం ఇవ్వలేదు.సీఎం ఏవో నామినేటెడ్ పోస్టులు ఇస్తామన్నారు. నువ్వు నా గుండెల్లో వున్నావు... నిన్ను ఎలా పోగొట్టుకుంటాం అన్నారు. ఏవేవో లబ్ధి చూపించారు. జీవితంలో ఏ లబ్ధికీ లొంగని వాడిని ఈ నామినేటెడ్ పదవులకు లొంగుతానా?

దళిత నాయకత్వాన్ని అవమానించారు!

మాలాంటి చదువుకున్న వారు కూడా రాజకీయాల్లో వుండాలన్న చిన్న విషయం కూడా సీఎంకు తెలియకపోతే ఎలా? జగన్ తండ్రి రాజశేఖర్‌రెడ్డి సొంత సామాజికవర్గం వారిని సలహాదార్లుగా పెట్టుకోలేదు.ఉండవల్లిని ప్రోత్సహించారు.కేవీపీ రామచంద్రరావును సలహాదారుగా పెట్టుకున్నారు.ప్రజాస్వామ్యంలో అన్ని వర్గాలనూ కలుపుకుని ముందుకు తీసుకెళ్ళాలే తప్ప అధికారంలో నేనే వుండాలి... వేరే ఎవరూ వుండకూడదు... నేకొక్కడినే పార్టీ అన్న విధానం వుంటే ఎలా? నన్నే కాదు రాష్ట్రవ్యాప్తంగా దళిత నాయకత్వాన్ని సీఎం జగన్ అవమానించారు.

ఓడినా గెలిచినా జనంలోనే వున్నా!

ఓడినా గెలిచినా తేడా చూపకుండా జనంలోనే వున్నా. అధికారం వున్నా లేకున్నా సమస్యల పరిష్కారానికి కృషి చేశా.2009లో ప్రజారాజ్యం తరపున ఎంపీగా ఓడిపోయినా కూడా నియోజకవర్గం వదిలిపెట్టకుండా ప్రజలకు అందుబాటులో వున్నా. రాజకీయ నాయకులు, కుల నాయకులు, ప్రజా సంఘాలతో కలసి పనిచేశా. నా కుటుంబం నాపై ఆధారపడదు. ఎవరి వ్యాపారాలు వారికున్నాయి.అవినీతికి పాల్పడాల్సిన అవసరం, ఆలోచన మాకు లేదు. ఎవరిపైనా కక్ష సాధింపు వుండదు. ఎవరిపైనా కేసులు పెట్టించలేదు. ఎవరినీ దూషించలేదు. ప్రజలు ప్రశాంతంగా సంతోషంగా వుండేందుకు కృషి చేస్తా. నన్ను నమ్మండి.

వచ్చేది ఎన్డీయే ప్రభుత్వాలే.... అందుబాటులో వుండి అభివృద్ధి చేస్తా

కేంద్ర రాష్ట్రాల్లో వచ్చేది ఎన్డీయే ప్రభుత్వాలే. నియోజకవర్గంలోనే పూర్తి సమయం ప్రజలకు అందుబాటులో వుంటా. ప్రభుత్వ పాలనపై నాకు ఎంతో అనుభవం వుంది. అవగాహనతో పాటు సమర్థతా వుంది. బ్యూరోక్రాట్‌గా అభివృద్ధి ప్రతిపాదనలు ఎలా చేయాలో, ఫైళ్ళు ఎలా కదిలించాలో, అనుమతులు ఎలా సాధించాలో, నిధులు ఎలా పొందాలో నాకు తెలియంది కాదు. గతంలో ఎంపీగా వున్నపుడు అపాయింట్‌మెంట్ లేకుండా ప్రధాని మోదీని ఆరుసార్లు కలిశా. అలాంటిది ఇపుడు ఆయన ప్రభుత్వంలోనే ఎంపీగా మళ్ళీ గెలిస్తే నా అనుభవాన్ని, సమర్థతను వినియోగించి తిరుపతి పార్లమెంటు నియోజకవర్గానికి సరికొత్త రూపమిచ్చేందుకు శ్రమిస్తా!

తిరుపతి ఎంపీగా ఎవ్వరూ చేయని అభివృద్ధి చేశా!

తిరుపతి ఎంపీగా 2014లో గెలిచాక నియోజకవర్గాన్ని గతంలో ఎవ్వరూ చేయనంతగా అభివృద్ధి చేశా. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుంటే ఆరింటిలో కార్యాలయాలు ఏర్పాటు చేశా. ఏడాదిలో 365 రోజులూ ప్రజలకు అందుబాటులో వున్నా. కార్యాలయాల్లో సిబ్బందిని పెట్టి మరీ సమస్యలపై వచ్చిన ప్రజలకు అవసరమైన లెటర్లు అందేలా చూశా.నియోజకవర్గ పరిధిలోని 1500 గ్రామాల్లో పర్యటించా. 1400 గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టా. దానికోసం నా ఎంపీ నిధులతో పాటు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులను కూడా భారీగా తెప్పించా. ఆ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కమ్యూనిటీ హాళ్ళు, బస్ షెల్టర్లు, ఇతర భవనాలు కట్టించా. ఇతరులు చేసినట్టు ఐఎస్ఐ మార్క్ లేని నాసిరకం వీధిలైట్లు, గ్రావెల్ రోడ్లకు నిధులు కేటాయించి వృధా చేయలేదు.

విదేశీ విమాన సర్వీసులు నడిపిస్తా!

తిరుపతి విమానాశ్రయం అంతర్జాతీయ విమానాశ్రయంగా ఎదగడానికి 2014-17 నడుమ కీలక పాత్ర పోషించా. భూ సేకరణలో భూములు, భవనాలు కోల్పోయిన రైతులకు, బాధితులకు పరిహారం అందించడానికి కేంద్రం నుంచీ నిధులు కూడా విడుదల చేయించా. విమానాశ్రయ విస్తరణ పనులు జరిగినా దురదృష్టవశాత్తూ విదేశీ విమాన సర్వీసులు ఇంతవరకూ మొదలు కాలేదు.ఎప్పటినుంచో జిల్లా వాసులు, ఇరుగుపొరుగు జిల్లాల వారు గల్ఫ్ దేశాలకు బతుకుదెరువు కోసం వెళుతున్నారు. అలాగే ఇటీవలి కాలంలో విదేశీ విద్య కోసం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ యువత ఇతర దేశాలకు వెళ్ళడం పెరుగుతోంది.అంతేకాకుండా విదేశాలు సందర్శించేందుకు టూరిస్టులుగా వెళుతున్న వారి సంఖ్య కూడా క్రమేపీ ఎక్కువవుతోంది. ఇలాంటి వారు బెంగళూరు, చెన్నై, హైదరాబాదు విమానాశ్రయాల నుంచీ విదేశాలకు ప్రయాణించాల్సి వస్తోంది. నేను గెలిస్తే విదేశీ విమాన సర్వీసులు ప్రారంభమయ్యేలా చూస్తా. తొలుత దుబాయ్, సింగపూర్, మలేషియా, అబుదాబి వంటి సమీప దేశాలకు సర్వీసులు నడిచేలా చూస్తా. తర్వాత యూరప్ దేశాలకు, ఆటుపై అమెరికాకు కూడా విమాన సర్వీసులు నడవడానికి కృషి చేస్తా.

ఇపుడు జరుగుతున్న ప్రాజెక్టులన్నీ ప్రతిపాదించింది నేనే!

ప్రస్తుతం తిరుపతి లోక్‌సభ నియోజకవర్గంలో జరుగుతున్న ప్రాజెక్టులన్నింటినీ ప్రతిపాదించింది నేనే. వాటి ప్రతిపాదనలు మొదలుకుని మంజూరు వరకూ నా పాత్ర చాలా కీలకం.తిరుపతి వరల్డ్ క్లాస్ రైల్వే స్టేషన్ పేరిట అభివృద్ధి ప్రతిపాదనలు నేనే పెట్టా. తిరుపతి-రేణిగుంట నడుమ ఇరు వైపులా అభివృద్ధి చెందేందుకు వీలుగా మూడు సబ్‌వేలు ప్రతిపాదించా. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే ట్రాక్ నిర్మాణ పనులు ఆగిపోతే తిరిగి ప్రారంభించేలా చేశా.తిరుపతి స్మార్ట్ సిటీ మొదటి దశలో ప్రధాన పాత్ర పోషించా.నాటి కేంద్ర మంత్రి వెంకయ్య నాయుడిని కలసి స్మార్ట్ సిటీగా తిరుపతిని మొదటి విడతలోనే ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశా. తిరుచానూరు రైల్వే స్టేషన్ ఏర్పాటుకు కారణం కూడా నేనే.ఎన్నో ఏళ్ళుగా ఆగిపోయి వుండిన నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారి పనులు తిరిగి మొదలు పెట్టించా. ప్రత్యేక హోదా కోసం రాజీనామా చేయడం వల్ల మిగిలినవి చేయలేకపోయా.



ఈ ఫొటోలు చూశారా.. ఎటు చూసినా మురుగు తాండవం చేస్తోంది. మరోవైపు శిథిలావస్థకు చేరుతున్న గోడలు, పెచ్చు లూడుతున్న పైకప్పులు.. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ ఇళ్ల సముదాయం అధ్వానానికి చిరునామా.. ఇదెక్కడో కాదు.. తిరుపతికి కూతవేటు దూరంలోని దామినేడు హౌసింగ్ కాలనీ. ఆలనా పాలనా లేక నిర్మించిన పదిహేనేళ్లకే సమస్యల నిలయంగా మారిపోయింది. 83 బ్లాకుల్లో 1,980 ఇళ్లలో సుమారు 2,500 కుటుంబాలుంటున్నా కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ పాడై తాగునీటితో కలసిపోతోంది. అనారోగ్యం బారిన పడి, సమస్యలతో సహజీవనం చేయలేక కొందరు మూటా ముల్లె సర్దుకుంటున్నారు. గత ఎన్నికల వేళ చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి సందర్శించి సమస్యలన్నీ పరిష్కరిస్తానంటే వీరంతా నమ్మేశారు. ఐదేళ్లూ గడిచిపోయాయి. మళ్లీ ఎన్నికలొచ్చేసినా ఆయన జాడలేదు. ఎక్కడి సమస్యలక్కడే ఆయన హామీలను వెక్కిరిస్తున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



గోడు గోడుమంటున్న దామినేడు

మురుగు మధ్యే కాలనీవాసుల జీవనం

చెవిరెడ్డి ఇచ్చిన హామీలేమయ్యాయి?



కలుషిత నీళ్లతోనే వంట

డ్రైనేజీ నీళ్లు తాగేనీళ్లలోనే కలిసి వస్తాండాయి. బిందెల్లో పట్టుకున్న నీళ్లే భరించలేని వాసన. ఆ నీళ్లతోనే వంట చేస్తాండాం. ఇంకేం చేస్తాం. డబ్బులిచ్చి క్యాన్ నీళ్లతో వంట చేసుకునే స్తోమత మాకు లేదు. ఆ నీళ్లే వొళ్లికి పోసుకుంటాండాం. చర్మరోగాలు వస్తానే ఉండాయి. ఎలక్షన్లప్పుడు మాత్రమే కాలనీకి వచ్చి ఓట్లు అడిగే నాయకులు తర్వాత పట్టించుకోరు. మున్సిపాలటీవోళ్లకి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోరు. - లక్ష్మి



పైన పెచ్చులూడి పడుతున్నాయి

డ్రైనేజీ పొంగిపోయి రోడ్లపైకి వస్తాండాయి. ఇళ్లలోకి కూడా మురికి నీళ్లు వస్తాండాయి. వాసన మధ్య బతకాల్సి వచ్చింది. వానాకాలమైతే ఇంట్లో ఉండలేం. పైన పెచ్చులూడి పడుతున్నాయి. యాడ నెత్తిపై పడతాయేనని భయం భయంగా ఉంటాండము. సొంతిళ్లు కాబట్టి ఇక్కడినుంచి పోలేక, ఇబ్బందుల్లో ఈడ ఉండలేక అయోమయంగా ఉండాము. - సుమతి

చిత్తూరు నూతన కోర్టు భవనాల ప్రారంభం నేడు



నూతన కోర్టు భవనం

చిత్తూరు లీగల్, ఏప్రిల్ 26 : చిత్తూరులోని హైరోడ్డు వద్ద జిల్లా కోర్టు భవనాలను శనివారం ఉదయం 9.30గంటలకు ప్రారంభించనున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, గెస్ట్ ఆఫ్ ఆనర్‌గా జస్టిస్ ఎస్వీఎన్ భట్టి పాల్గొంటారు.హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్,హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందన రావు హాజరు కానున్నారు.వీరంతా శుక్రవారం రాత్రికే చిత్తూరులోని ప్రభా గ్రాండ్ హోటల్‌కు చేరుకోగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.చిత్తూరు నగరంలోని హైరోడ్డు వద్ద గతంలో వుండిన కోర్టు భవనాలు శిథిలావస్థకు చేరడంతో వాటి స్థానంలో రూ.43కోట్లతో 15 నూతన కోర్టు భవనాల నిర్మాణం 2018లో ప్రారంభమైంది.పనులు పూర్తి కావడంతో శనివారం ప్రారంభించనున్నారు.త్వరలోనే ఇక్కడినుంచే కోర్టు కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి.

హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు స్వాగతం



చీఫ్ జస్టిస్‌కు స్వాగతం పలుకుతున్న న్యాయమూర్తులు

రేణిగుంట, ఏప్రిల్ 26: ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ రఘునందనరావుకు రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శుక్రవారం సాయంత్రం విజయవాడ నుంచి వచ్చిన వీరికి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జేసీ ధ్యానచంద్ర, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, ఉమ్మడి జిల్లా జడ్జీలు స్వాగతం పలికారు.అనంతరం వారు చిత్తూరు బయల్దేరి వెళ్లారు.

వైభవంగా శ్రీరాముడి పట్టాభిషేకం



చంద్రగిరి, ఏప్రిల్ 26: చంద్రగిరిలో వెలసిన కోదండరామాలయంలో శుక్రవారం ఉదయం శ్రీరాముడు పట్టాభిషేకాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో సీతారామలక్ష్మణ సమేత హనుమంతు ఉత్సవర్లను విశేషంగా అలంకరించి సింహాసనంపై అధిష్ఠింపజేశారు. అనంతరం వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీరాముడి పట్టాభిషేకాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసభట్టర్ మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా, రామరాజ్యం స్థాపన వెల్లివిరిసేలా ఆశీర్వాదించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునిహరిబాబు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అమర ఆస్పత్రిలో 3డీ టెక్నాలజీ ఎంఆర్ఐ



ఎంఆర్ఐ స్కానింగ్ గదిని ప్రారంభిస్తున్న గల్లా రామచంద్రనాయుడు

తిరుపతి (ఆటోనగర్), ఏప్రిల్ 26: రేణిగుంట మండలం కరకంబాడి సమీపంలో వున్న అమర ఆస్పత్రిలో అత్యాధునిక త్రీడీ టెక్నాలజీ ఎంఆర్ఐ యంత్రాన్ని, బ్లడ్‌బ్యాంక్‌ను మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, గల్లా రామచంద్రనాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గౌరినేని ప్రసాద్, డాక్టర్ గౌరినేని రమాదేవి, రేడియాలజిస్టు వినోద్, సీవో వేణుగోపాల్, ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజరు నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

214మంది హెచ్‌ఎంలకు, 26 మంది ఎంఈవోలకు షోకాజ్ నోటీసులు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 26: యూడైస్ (విద్యార్థుల నమోదు) ప్రక్రియలో చోటు చేసుకున్న తప్పులను కారణాలుగా చూపుతూ 25 మండలాల్లోని 213మంది హెచ్‌ఎంలకు, 26 మంది ఎంఈవోలకు చిత్తూరు డీఈవో దేవరాజు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాప్టో, ఎస్టీయూ సంఘాల నేతలు శుక్రవారం డీఈవోతో చర్చలు జరిపారు. శాఖాపరమైన లోపాలు సవరించకుండా సమాచారం రాలేదనే సాకుతో టీచర్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. ఉపసంహరించుకోవాలని వినతిపత్రమిచ్చారు.

బంగారు తిరుచ్చిపై పద్మావతిదేవి సాక్షాత్కారం



తిరుచానూరు, ఏప్రిల్ 26: తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారు శుక్రవారం బంగారు తిరుచ్చిపై భక్తులకు సాక్షాత్కారమిచ్చారు. ఉదయం కల్యాణోత్సవం, లక్ష్మీ పూజ వేడుకగా జరిగింది. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవ మూర్తిని ఫ్రైడేగార్డెన్‌కు వేంచేపు చేసి తిరుమంజనం నిర్వహించారు. అనంతరం అలంకార శోభితురాలైన అమ్మవారు బంగారుతిరుచ్చిపై కొలువుదీరి తిరు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, గణేష్, శేషగిరి, ప్రసాద్, అర్చకులు బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలనగర్‌లో నేలపాలవుతున్న తాగునీరు



తిరుమలనగర్ పంచాయతీలో వృథాగాపోతున్న తాగునీరు

మంగళం, ఏప్రిల్ 26: ఒక పక్క ఎండలు మండిపోతున్నాయి. ప్రజలకు తాగునీటిని సక్రమంగా అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కానీ చంద్రగిరి నియోజకవర్గం మంగళం ప్రాంతంలోని తిరుమలనగర్ పంచాయతీలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాగునీరు నేలపాలై పోతోంది. ఈ ప్రాంతంలో దాదాపు 450 కుటుంబాలు ఉన్నా యి. వీరి తాగునీటి అవసరాలు తీర్చడానికి బోరువేసి ప్రతివీధికి పైపులైన్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. గత కొంతకాలంగా తిరుమలనగర్ పంచాయతీలోని నాలుగు ప్రాంతాల్లో పైపులైన్లు ఊడిపోయి మంచినీరంతా వృథాగా నేలపాలవుతోంది. దీనిపై ప్రజలు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు. నీరు అందక తాము పడుతున్న అవస్థలు చెప్పుకుంటూనే ఉన్నారు. అయినా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. వెంటనే పంచాయతీ అధికారులు స్పందించకపోతే ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తామని కాలనీవాసులు అంటున్నారు.

రౌడీయిజం.. నీ ఇంట్లో ఉంది

ఎమ్మెల్యే చెవిరెడ్డిపై టీడీపీ నాయకుల ఫైర్

చంద్రగిరి, ఏప్రిల్ 26: రౌడీయిజం, అరాచకాలు, దౌర్జన్యాలు, దాడులు చేసే సంస్కృతి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఇంట్లో, ఒంట్లో ఉన్నాయని టీడీపీ నాయకులు ఫైర్ అయ్యారు. శుక్రవారం చంద్రగిరి టీడీపీ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, పార్లమెంటు ఉపాధ్యక్షుడు గౌస్‌బాషా ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా టీడీపీ నేత దొడ్ల కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. డబ్బులు పెట్టినా చెవిరెడ్డి కుమారుడి నామినేషన్‌కు జనాలు రాకపోవడం, పులివర్తి నాని నామినేషన్ కోసం ఎండను సైతం లెక్క చేయకుండా 50వేల మంది జనాలు స్వచ్ఛందంగా రావడం చూసి ఓర్వలేక రాళ్ల దాడికి పాల్పడి తిరిగి టీడీపీ నేతలపైనే కేసులు పెట్టించారని మండిపడ్డారు. సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడుతూ.. నామినేషన్ సందర్భంగా ఎమ్మెల్యే చేసిన దారుణాలు, రౌడీయిజం, దౌర్జన్యాలు, అక్రమ కేసుల గురించి ప్రజలందరికీ తెలిసిందేన్నారు. 2019లో హామీలు ఇచ్చి నెరవేర్చకుండా ప్రస్తుతం ఒంగోలు ఎంపీ స్థానానికి పోటీ చేయడం కోసం వెళ్లారని ఎద్దేవా చేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో నాయకులు ఎల్లప్పరెడ్డి, రాకేష్‌చౌదరి, అమ్ములు, బాలకృష్ణమూర్తి, రాజులుగారి వినోద్ రెడ్డి, సక్కూరి ధనంజయరెడ్డి, గురుమూర్తిరెడ్డి, లోకానాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

టీడీపీలో పలువురు చేరిక

తిరుచానూరు, ఏప్రిల్ 26: చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆధ్వర్యంలో శుక్రవారం రణధీరపురం పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. పార్టీలో చేరినవారిలో నాగరాజు, బాబు, నాగార్జున తదితరులున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీతి నిజాయితీ, నిబద్ధత కలిగిన నానీతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమన్నారు. ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

ఇంటింటా ప్రచారం

మంగళం, ఏప్రిల్ 26: మంగళం పరిధిలోని సప్తగిరికాలనీలో శుక్రవారం టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ అభ్యర్థి పులివర్తి నాని చెల్లెలు ధనలక్ష్మి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నానికి ఒక అవకాశం ఇచ్చి గెలిపించాలని, అభివృద్ధి అం టే ఏమిటో చూపిస్తాడని ప్రజలకు వివరించారు. నాయకులు భాస్కర్‌రెడ్డి, అల్లాబాషా, సుబ్బుయాదవ్, సురేష్ నాయుడు, చలపతి, తాతయ్య, శ్రీనివాస్‌యాదవ్, వెంకటసుబ్బమ్మ, హరికృష్ణ, గోపాల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



నాని సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు, సప్తగిరికాలనీలో టీడీపీ నాయకుల ప్రచారం

డిజిటల్ టెక్నాలజీకి మరింత ప్రాధాన్యం

- థాయ్‌లాండ్ సదస్సులో మహిళా వర్సిటీ వీసీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 26: యూనివర్సిటీలోని బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో డిజిటల్ టెక్నాలజీ అమలుకు మరింత ప్రాధాన్యం ఇస్తామని పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ భారతి పేర్కొన్నారు. థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్ ఏసియన్ ఫసిఫిక్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన సదస్సులో ఆమె ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాముఖ్యత ఏర్పడిందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోకపోతే ఈతరానికి ఉన్నత ఉపాధి అవకాశాలు దక్కవని స్పష్టం చేశారు. పారిశ్రామిక రంగంలోనూ సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకోవడం ద్వారానే వేగవంతమైన ఉత్పత్తి, అమ్మకాలు, లాభసాటిగా మారతాయన్నారు. మహిళలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు పద్మావతి యూనివర్సిటీ ప్రత్యేక కృషి చేస్తుందని చెప్పారు. వర్సిటీ అంతర్జాతీయ వ్యవహారాల డీన్ పి.విజయలక్ష్మి పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వీసీ భారతి



ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా బంగారు పతకాలు, సర్టిఫికెట్లు అందుకుంటున్న జి.సురేష్ కృష్ణ -మైత్రేయి ఆర్య - శ్యామ్‌సుందర్ - గ్రీష్మ ఎంఎస్ - ఆర్.హరిప్రియ - ఉన్నవ శ్రీవెంకటనాగ శైలజ - భానుజ - ఉప్పలదడియం భరత్‌శర్మ - ఇందుకూరి నాగసోపిక - రితిషా చక్రవర్తి

సంస్కృతంతో సాంత్వన

- సంస్కృత వర్సిటీ స్నాతకోత్సవంలో ఉప రాష్ట్రపతి
- 67 బంగారుపతకాలు.. 580మందికి డిగ్రీల ప్రదానం

తిరుపతిరూరల్, ఏప్రిల్ 26: తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ మూడో స్నాతకోత్సవం చాన్సలర్ పద్మభూషణ్ డాక్టర్ ఎన్.గోపాలస్వామి అధ్యక్షతన శుక్రవారం వర్సిటీ ఇండోర్ స్టేడియంలో అట్టహాసంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్, సుదేశ ధన్కర్ దంపతులకు వర్సిటీ అధికారవర్గాలు వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్నాతకోత్సవ సభలో ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ.. తుఫానువంటి ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో సంస్కృతం ఓప్రత్యేకమైన సాంత్వనని అందిస్తుందని చెప్పారు. అలాగే మానసికబలం, ఆధ్మాత్మిక ప్రశాంతత, లోతైన పరిజ్ఞానాన్ని ఏకకాలంలో అందించగలశక్తి సంస్కృతానికి ఉందని అన్నారు. 'తిరుపతి ఆధ్మాతిక నగరం. అలాగే వర్సిటీ మోటో.. తమసోమ జ్యోతిర్గమయ.. జీవనానికి ప్రోత్సాహకమైన ధ్యేయ వాక్యం. నాలుగు దశాబ్దాలుగా శ్రీవారి పాదాలచెంత విరాజిల్లుతున్న వర్సిటీ సంప్రదాయ శాస్త్రాలను అధ్యయనం చేసేందుకు ప్రత్యేక కేంద్రంగా ఉంది. ఇక్కడే అనంతశయనం అయ్యంగార్, గోపాలస్వామి వంటివారు ఉండడం, పనిచేయడం గొప్పవిశేషం. సంస్కృతం.. దేవభాష, ప్రథమభాష, వేదభాష, దివ్యభాష, సర్వభాషలకు తల్లివంటిది. సంస్కృతంలోని శబ్దాలు అటుఇటు ప్రయోగించినా అర్థంలో ఎటువంటి మార్పు ఉండదు. దీని కారణంగా క్లాసికల్ లాంగ్వేజ్‌గా గుర్తించడం జరిగింది. సంస్కృతం మనల్ని దైవికానికి అనుసంధానించడమే కాక, ప్రపంచం గురించి మరింత సమగ్రమైన అవగాహనవైపు మార్గాన్ని ప్రకాశవంతం చేస్తుంది. ఏభాషనైనా సమాజం వినియోగించి, సాహిత్యం కూర్చినప్పుడే మనుగడ సాగుతుంది. మనదైనందిన జీవితంలో సంస్కృతభాష వినియోగం పెరగాల్సిన అవసరం ఉంది. తిరుమల శ్రీనివాసుడి దర్శనభాగ్యం నా అదృష్టం. శేషాచలం పర్వతాలమధ్య నిర్మలమైన వాతావరణంలో నెలకొన్న ఈప్రసిద్ధ పుణ్యక్షేత్రం మనదేశ ఆధ్మాత్మిక వారసత్వానికి మహోన్నత చిహ్నం. దేశపౌరుల ఆనందం, శ్రేయస్సుకోసం స్వామివారిని ప్రార్థించా' అని ఉపరాష్ట్రపతి వివరించారు. చాన్సలర్ ఎన్.గోపాలస్వామి మాట్లాడుతూ.. సంస్కృత అధ్యాపనంలో వర్సిటీ దేశంలోనే ప్రథమస్థానంలో ఉండడం ఆనందదాయకమని తెలిపారు. వర్సిటీలో విభిన్న పరిశోధనలు చేపట్టాలని, కొత్తగా మల్టీ డిసిప్లినరీ పాఠ్యక్రమాలను ప్రవేశపెట్టాలని, సంస్కృతాన్ని మరింతగా ప్రమోట్ చేయడానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఐసర్ డైరెక్టర్ సంతనుభట్టాచార్య, వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ ఆర్‌జే రమాశ్రీ, సీవోఈ డాక్టర్ కె.సాంబశివమూర్తి, దినేష్‌కామత్, డీన్లు, విభాగాల హెడ్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. సభాసంచాలకుడిగా సాహిత్యవిభాగం ప్రొఫెసర్ చక్రవర్తి రంగనాథన్ వ్యవహరించారు. అంతకుముందు మహామహోపాధ్యాయ సాధుభద్రేన స్వామి వీడియో ద్వారా చేసిన అనుగ్రహ భాషణాన్ని ప్రజెంటేషన్ చేశారు. కాగా అవయవహ, కిరాతార్జునీయం, ఎక్స్‌ట్రాక్షన్ ఆఫ్ మల్టీవర్డ్ ఎక్స్‌ప్రెసన్ ఫర్ సాంస్క్రీట్, ఔషధ కల్పహ, అక్షయదీప్తిహి, మునివాహన లఘురూపకం గ్రంథాలను ఆవిష్కరించారు.

35మందికి బంగారు పతకాల ప్రదానం

35మంది విద్యార్థులకు 67 బంగారు పతకాలను ప్రదానం చేశారు. అలాగే 2022-23విద్యాసంవత్సరానికి వర్సిటీలో యూజీ, పీజీ, పీహెచ్‌డీ, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు పూర్తిచేసిన 580మంది విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేశారు. పీహెచ్‌డీలో 47మందికి, శాస్త్రిలో 90, బీఏలో 12, బీఎస్సీలో(కంప్యూటర్స్)12, బీఎస్సీలో (యోగా)11, ఆచార్యలో 140, ఎంఎస్సీ(కంప్యూటర్స్)లో 7, ఎంఏలో(హిందీ)5, ఎంఎస్సీలో(యోగా)21, బీఎడ్‌లో 107, ఎంఎడ్‌లో 36, సర్టిఫికెట్ ట్రాన్సలేషన్‌లో 1, డ్యాన్స్ అండ్ భరతనాట్యంలో 3, కమ్యూనికేటివ్ అండ్ ఫంక్షనల్ సాంస్క్రీట్‌లో 4, సితార్‌లో 8, మ్యూజిక్‌లో 3, డిప్లొమా కర్మకాండలో 13, ట్రాన్సలేషన్‌లో1, జ్యోతిష అండ్ వాస్తులో 9, పీజీ డిప్లొమా యోగా విజ్ఞాన్‌లో 9, యోగాథెరపి అండ్ స్ట్రెస్‌మేనేజ్‌మెంట్‌లో 11, దూరవిద్య శాస్త్రిలో 18, బీఏలో 9, సర్టిఫికెట్ సాంస్క్రీట్‌లో 1, ఆచార్యలో ఇద్దరు చొప్పున మొత్తం 580మందికి డిగ్రీలను అందజేశారు.

'మా ఊరికొస్తే చంపేస్తాం'

మాగాండ్లపల్లెలో బీసీవైపీ నేతలపై వైసీపీ శ్రేణుల దాడి

పుంగనూరు, ఏప్రిల్ 26: పుంగనూరు మండలం మాగాండ్లపల్లెలో శుక్రవారం వైసీపీ కార్యకర్తలు బీసీవై పార్టీకి చెందిన నలుగురు నాయకులపై కర్రలతో దాడి చేశారు. బీసీవై పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బోడే రామచంద్రయాదవ్ కాన్వాయ్‌లోని వాహనం అద్దాలను ధ్వంసం చేశారు. బాధితుల కథనం మేరకు.. ఎన్నికల ప్రచారంలో భాగంగా రామచంద్రయాదవ్ మాగాండ్లపల్లెలో రోడ్డుషో చేసి, వెళుతుండగా కాన్వాయ్ చివరలో ఉన్న వాహనంలోని ఆ పార్టీ నేతలు ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. 'మాకే పాంప్లెట్లు ఇస్తారా' అంటూ గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త శశిభూషణ్‌రెడ్డి మరికొందరు బీసీవైపీ నాయకులు నారాయణస్వామి, వేణుగోపాల్‌రెడ్డి, వంశీ, సురేంద్రయాదవ్‌లపై కర్రలు, రాళ్లతో దాడి చేశారు. దుర్భాషలాడి కరపత్రాలు చింపేశారు. వారు వాహనంలో వెళ్లిపోతుండగా వైసీపీ జెండాలతో వెంబడించి రాళ్లతో వెనుక అద్దాలను ధ్వంసం చేశారు. ఆ నలుగురిని పట్టుకున్నారు. విషయం తెలుసుకున్న రామచంద్రయాదవ్ మాగాండ్లపల్లెకు చేరుకున్నారు. అప్పటికే పుంగనూరు సీఐ రాఘవరెడ్డి అక్కడ బందోబస్తు ఏర్పాటు చేసి ఉన్నారు. రామచంద్రయాదవ్ రాగానే అడ్డుకుని ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని, శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని చెప్పారు. తమ పార్టీ నాయకులను గ్రామస్తులు నిర్బంధించారని, వారిని విడిచిపెట్టాలని, అలాగే వారిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.పోలీసులు సర్దిచెప్పి బీసీవై పార్టీ నాయకులను విడిపించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

టీడీపీ కార్యకర్తలపై దాడి జరిగితే.. వారిపైనే కేసులు పెడతారా?

- అధికార యంత్రాంగంపై ఈసీకి ఫిర్యాదు చేస్తా
- చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని



మీడియాతో మాట్లాడుతున్న పులివర్తి నాని

తిరుపతి(కపిలతీర్థం), ఏప్రిల్ 26: తిరుపతి ఆర్డీవో కార్యాలయం ఎదుట టీడీపీ కార్యకర్తలపై దాడి జరిగితే.. ఆర్వో ఫిర్యాదుతో వారిపైనే కేసులు పెట్టడం అన్యాయమని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. నామినేషన్ వేసేందుకు తాము వచ్చే మార్గంలో అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేశారని చెప్పారు. అయితే నామినేషన్ ప్రశాంతంగా జరగాలని అవన్నీ తాము ఓర్చుకున్నామన్నారు. చివరకు ఆర్డీవో కార్యాలయానికి చేరుకునే సరికి గొడవలు సృష్టించేందుకు వైసీపీ నేతలు కొందరు టీడీపీ జెండాను కాళ్లతో తొక్కుతూ వివాదానికి తెరలేపారన్నారు. దీనివల్ల ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిందన్నారు. ఈ ఘర్షణలో తమ కార్యకర్తలపై రాళ్లతో దాడికి పాల్పడ్డారని, దీనికి సంబంధించిన ఆధారాలు కూడా ఉన్నాయని చెప్పారు. అలాగే నామినేషన్ వేసేందుకు వచ్చిన తన కోడలిపైనా వైసీపీ నేతలు మూకుమ్మడిగా దాడికి యత్నించారని ఆరోపించారు. పులివెందుల, కడప రౌడీయిజాన్ని ప్రశాంతమైన చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాలకు చెవిరెడ్డి భాస్కరరెడ్డి తీసుకొచ్చారని దుయ్యబట్టారు. ఇప్పటికే చంద్రగిరి నియోజకవర్గంలో అన్నదమ్ములు, కులాలు, కుటుంబాల నడుమ చెవిరెడ్డి గొడవలు సృష్టిస్తున్నారన్నారు. 'గతంలో నా భార్యపై, ఇప్పుడు నా కోడలిపై దాడికి పాల్పడ్డావు.. చంద్రగిరిలో మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా?' అని చెవిరెడ్డిని ప్రశ్నించారు. ఇక్కడ ఎర్రచందనం, ఇసుక, మట్టి, మఠం భూములు పూర్తిగా స్వాహా చేసి.. ఇప్పుడు గంజాయి, డ్రగ్స్, గెలాక్సీ క్వారీలు దోచుకోవడానికి ఒంగోలుకు వెళ్లావా? లేదా? అని నిలదీశారు. ప్రస్తుతం అధికార యంత్రాంగం వైసీపీకి అనుకూలంగా పని చేస్తుందనేదానికి నిదర్శనం నామినేషన్ వద్ద జరిగిన ఘటనే అని చెప్పారు. ఈ ఘటనపై ఆధారాలతో సహా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తానని స్పష్టం చేశారు. టీడీపీ నేతలు డాలర్స్ దివాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణే లక్ష్యం: కలెక్టర్


సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 26: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని అధికారులను కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారంరాత్రి కలెక్టరేట్‌లో ఎన్నికల పరిశీలకులు కరిగౌడ, ఉజ్వల్‌కుమార్ ఘోష్, వ్యయపరిశీలకులు ప్రదీప్‌కుమార్, వీజీ శేషాద్రి, మీనుఓలా, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 696 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. వచ్చేనెల 1న రాజకీయ పార్టీల నేతల సమక్షంలో ఈవీఎం రెండో విడత ర్యాండమైజేషన్ చేపడతామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ.. ఎనిమిది అంతర్రాష్ట్ర, పది అంతరజిల్లాల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. నగదు, మద్యం, విలువైన లోహాలు, ఫ్రీబీస్ తదితరాలు కలిపి జిల్లాలో సుమారు రూ.18.91కోట్లు సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ ధ్యానచంద్ర, అధికారులు అదితిసింగ్, ఆర్డీవో పెంచలకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంత మందిని అరెస్టు చేశారు?

- సెబ్ స్టేషన్ల ఆకస్మిక తనిఖీల్లో డిప్యూటీ కమిషనర్


సెబ్ రూరల్ స్టేషన్ వద్ద డీసీ విజయశేఖర్

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 26: 'ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి ఎన్ని కేసులు పెట్టారు. ఎంత మందిని అరెస్టు చేశారు' అని తిరుపతి సెబ్ అధికారులను రాయలసీమ సెబ్ డిప్యూటీ కమిషనర్ (డీసీ) విజయశేఖర్ ప్రశ్నించారు. శుక్రవారం తిరుపతిలోని సెబ్ అర్బన్, రూరల్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది అందుబాటులో ఉన్నారా లేదా అని పరిశీలించారు. రోజువారీ జనరల్ డైరీలు, ఎఫ్ఆర్ రికార్డులు, సీజ్‌చేసిన మందు వివరాలు, అరెస్టులు, బెయిల్‌పై ఎంతమంది బయట ఉన్నారు.. గంజాయి ఎంత సీజ్ చేశారు.. అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తిరుపతి అర్బన్ సెబ్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ సామినాథన్, సిబ్బంది పనితీరును అభినందించారు. అక్కడినుంచి తిరుపతి రూరల్ స్టేషన్‌కు వెళ్లి అక్కడ సీఐ భీమలింగంతో మాట్లాడుతూ.. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అక్రమాలకు పాల్పడే వారిని ఎంతమందిని తొలగించారని తెలుసుకుని, పనితీరు మెరుగుపరచుకోవాలని సూచించారు. తమిళనాడు నుంచి మద్యం, ఇతర మత్తు పదార్థాలు రాకుండా గట్టిగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డీసీ వెంట సెబ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, సీఐలున్నారు.

పిట్టగోడపైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



వాకాడు, ఏప్రిల్ 26: పట్టణంలోని వాకాడు అశోక్ పిల్లర్ సెంటర్ సమీపంలోని స్వర్ణముఖి నది తూపిలి సరఫరా కాలువ వంతెన పిట్టగోడపైకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లింది. శుక్రవారం రాత్రి గూడూరు నుంచి వాకాడు డిపోకు వస్తున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి చల్లకాలువ వంతెనపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ప్రయాణికులకు తృటిలో ప్రమాదం తప్పింది. బస్సు ముందు భాగం పాక్షికంగా ధ్వంసమైంది. కాగా అశోక్ పిల్లర్ ప్రాంతంలో విద్యుద్దీపాలు వెలగకపోవడంతో ప్రమాదం జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం దివాలా

హామీలను నెరవేర్చని సీఎంకు జనాన్ని ఓట్లు అడిగే హక్కులేదు: ఎన్డీయే కూటమి నేతలు



మీడియాకు వివరాలు తెలియజేస్తున్న నరసింహ యాదవ్, పసుపులేటి హరిప్రసాద్ తదితరులు

తిరుపతి (కపిలతీర్థం), ఏప్రిల్ 26: ఐదేళ్ల వైసీపీ పాలనతో రాష్ట్రం దివాలా తీసిందని ఎన్డీయే కూటమి నేతలు.. తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్ విమర్శించారు. ప్రెస్‌క్లబ్‌లో వీరు శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను నెరవేర్చని సీఎంకు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. కేంద్ర పథకాలకు తన వాటాగా రాష్ట్రం నిధులు కేటాయించక పోవడంతో అనేక ప్రాజెక్టులు అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. ఎస్సీలను ఓటు బ్యాంకుగానే జగన్ చూస్తున్నారు తప్ప, వారికి చేసిందేమీ లేదన్నారు. కాపు రిజర్వేషన్‌ను సైతం తొలగించిన ఘనుడు అని మండిపడ్డారు. మద్యపాన నిషేధం, సీపీఎస్ రద్దు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చి, ఏ ఒక్కటీ నెరవేర్చిన దాఖలాలు లేవన్నారు. ఇక పవిత్రమైన తిరుపతిని గంజాయి వనంగా మార్చిన చరిత్ర తిరుపతి ఎమ్మెల్యే తనయుడికే దక్కిందని విమర్శించారు. తిరుపతి అభివృద్ధి పథంలో నడవాలంటే రానున్న ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి చెందిన జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు, ఎంపీగా పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి వరప్రసాదరావుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. అనంతరం ఐదేళ్ల వైసీపీ పాలనపై వారు చార్జిషీటును విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆనంద్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు

చెత్త పాలకులను తరిమికొట్టండి

ప్రజలకు జనసేన అభ్యర్థి ఆరణి పిలుపు - కొర్లగుంట ప్రచారంలో కూటమి నేతలకు జననీరాజనం


కొర్లగుంటలో జరిగిన ప్రచారంలో ఆరణి, సుగుణమ్మ, జేబీ, అన్నా రామచంద్రయ్య



తిరుపతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతి స్మార్ట్ సిటీని.. వైసీపీ ప్రభుత్వం చెత్త సిటీగా మార్చేసింది. కాలువల్లోని వ్యర్థాలను తొలగించినట్లే.. చెత్త పాలకులను తరిమికొట్టే సమయం ఆసన్నమైంది' అని ప్రజలకు టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న జనసేన అసెంబ్లీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి జేబీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం కొర్లగుంటలో ఎన్డీయే కూటమి నేతల ప్రచారానికి అడుగడుగునా జనం నీరాజనాలు పలికారు. మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, మోహన్, తుడా మాజీ చైర్మన్ నరసింహ యాదవ్, యాదవ సంఘ నాయకుడు అన్నా రామచంద్రయ్య తదితరులు పాల్గొన్న ప్రచారం కూటమి నేతల్లో జోష్ నింపింది. ఈసందర్భంగా ఆరణి మాట్లాడుతూ నగరాన్ని అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే కరుణాకర రెడ్డి, ఆయన కొడుకు అభినయ్ రెడ్డి గొప్పలు చెప్పుకోవడం తప్ప, అంతా అవినీతి మయమన్నారు. స్మార్ట్ సిటీగా తిరుపతిని కేంద్రం ప్రకటించి నిధులిచ్చినా రాష్ట్ర ప్రభుత్వ వాటాను తెప్పించడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని విమర్శించారు. మారుతీనగర్‌లోని కాలువలో భారీగా వ్యర్థాలు చేరి మురుగు నిలిచిపోవడంపై చలించిన ఆరణి శనివారం మధ్యాహ్నంలోపు వ్యర్థాలను తొలగించకుంటే తమ పార్టీల కార్యకర్తలే తొలగిస్తారని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి, ఆర్సీ మునికృష్ణ, పులుగోరు మురళీకృష్ణా రెడ్డి, చినబాబు, దంపూరి భాస్కర్ యాదవ్, రుద్రకోటి సదాశివం, జనసేన నేతలు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, సుభాషిణి, వెంకట్ రాయల్, కిరణ్ రాయల్, ఆనంద్, రాజా రెడ్డి, బీజేపీ నేతలు వరప్రసాద్, నాదముని రెడ్డి పాల్గొన్నారు

వైసీపీ పాలనలో జగనన్న ఇంట్లోనైనా మంచి జరిగిందా?

- జనసేన తిరుపతి అసెంబ్లీ ఇన్‌చార్జి కిరణ్ రాయల్

తిరుపతి(కపిలతీర్థం), ఏప్రిల్ 26: వైసీపీ పాలనలో మీ ఇంట్లో మంచి జరుగుంటేనే వైసీపీకి ఓటు వేయండి అంటున్న జగన్.. ఆయన ఇంట్లో ఏం మంచి జరిగిందో చెప్పాలని జనసేన తిరుపతి అసెంబ్లీ ఇన్‌చార్జి కిరణ్ రాయల్ ప్రశ్నించారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జనసేన నేతలతో కలిసి ముఖానికి స్టిక్కర్ అంటించుకుని వచ్చి, వినూత్న రీతిలో మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రౌడీ, రాక్షస పాలన సాగుతోందని మరో 15 రోజుల్లో దీనికి ప్రజలు స్వస్తి పలికి.. ఎన్డీయే కూటమికి పట్టం కట్టబోతున్నారన్నారు. చంద్రగిరి నియోజవర్గానికి సంబంధించి నామినేషన్ వేసేందుకు వచ్చిన టీడీపీ నేతలపై వైసీపీ నేతలు దాడులకు పాల్పడటం చూస్తే రాష్ట్రంలో పాలన ఏ రీతిలో జరుగుతుందో తెలుస్తుందన్నారు. తిరుపతిలో జనసేన అభ్యర్థికి వస్తున్న ప్రజాదరణను చూసి వైసీపీ అభ్యర్థి ఓర్వలేక తమ ప్రచారాలను అడ్డుకోవడం, గొడవలు సృష్టించడం వంటివి చేస్తున్నారని మండిపడ్డారు. ఇవి ఎక్కువ రోజులు సాగవని స్పష్టం చేశారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా తిరుపతిలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గెలవడం, రాష్ట్రంలో ఏన్డీయే కూటమి విజయం సాధించడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు హేమకుమార్, సుమన్‌బాబు, ఆది, లోహిత్, సిద్ధు, భాను, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

రేపే అండర్-15 చదరంగం పోటీలు

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 26: తిరుపతి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యూత్‌హాస్టల్ వేదికగా ఆదివారం అండర్-15 చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి హెచ్.శ్రీనివాస సూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 98852 38474, 80084 73330 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

శ్రీనివాస రామానుజన్‌కు నివాళి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 26: గణితశాస్త్ర పితామహులు శ్రీనివాస రామానుజన్ వర్ధంతి సందర్భంగా ఎస్వీయూలోని ఆయన విగ్రహానికి రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి శుక్రవారం పుష్పాంజలి ఘటించారు. పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అరాచక శక్తులను తిరుపతి భరించదు

గాజు గ్లాసు గుర్తుపై ఓటేయండని ఊకా విజయకుమార్ ప్రచారం



తిరుపతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): 'అరాచక శక్తులను తిరుపతి భరించదు. ప్రశాంత వాతావరణం కోసం ఎన్డీయే అభ్యర్థులను గెలిపించండి' అని ప్రజలను టీడీపీ సీనియర్ నేత ఊకా విజయకుమార్ కోరారు. శుక్రవారం పర్సాల వీధిలో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు మద్దతుగా ఊకా విజయ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గాజు గ్లాసు గుర్తుపై ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. వైసీపీ పాలకులపై ఉన్న వ్యతిరేకత, అసహనం ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఆరణి కుమార్తె సునీత, నాయకులు కట్టా జయరాం యాదవ్ పాల్గొన్నారు.

తిరుపతి - శ్రీకాకుళం మధ్య ప్రత్యేక రైళ్లు

తిరుపతి (సెంట్రల్), ఏప్రిల్ 26: వేసవిలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుపతి - శ్రీకాకుళం రోడ్డు మధ్య ప్రత్యేక రైళ్ల (07440-07441)ను దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు చేసినట్లు సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లు తిరుపతిలో మే 5 నుంచి 12వ తేదీ వరకు రాకపోకలు సాగుతాయని పేర్కొన్నారు. తిరుపతిలో ప్రత్యేక రైలు మే 5న బయల్దేరి రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి మీదుగా శ్రీకాకుళంరోడ్డు స్టేషన్‌కు చేరుకుంటుందని వివరించారు.

పలు రైళ్లు రద్దు: తిరుపతి రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్న కారణంగా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు. తిరుపతి - విల్లుపురం(16870), తిరుపతి - కాట్పాడి మధ్య నడుస్తున్న రైళ్ల (06693)ను ఈనెల 27 నుంచి మే 4వ తేదీ వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే పుదుచ్చేరి - తిరుపతి మధ్య నడిచే రైళ్లు(16112-16111) ఈనెల 27 నుంచి మే 4వ తేదీ వరకు తిరుపతి వరకే రాకపోకలు సాగిస్తాయని వివరించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.72 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.72 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ప్రకటించింది. గురువారం 61,432 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 27,660 మంది తలనీలాలు సమర్పించారు.

ఎస్వీ భూదాన పథకానికి రూ.1.02 కోట్లు


ఈవోకు చెక్ అందజేస్తున్న వర్ధమాన్‌జైన్, శేఖర్‌రెడ్డి

టీటీడీ ఎస్వీ భూదానపథకానికి శుక్రవారం రూ.1.02 కోట్లు విరాళాన్ని చెన్నైకి చెందిన అరుణ్ యాక్సెస్ హెల్త్‌కేర్ గ్రూప్ ఎండీ వర్ధమాన్‌జైన్ అందజేశారు. చెన్నై టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ శేఖర్‌రెడ్డితో కలిసి తిరుమలలో ఈవో ఏవీ ధర్మారెడ్డికి చెక్‌లను దాత అందజేశారు. వర్ధమాన్ జైన్ గతంలో కూడా ఈ పథకానికి రూ.1.5 కోట్లు విరాళంగా అందజేశారు.

ఎస్వీయూలో నేడు జాతీయ సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 26: ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ ఛాలెంజెస్ ఇన్ ఫ్లూయిడ్ పవర్ సిస్టం అనే అంశంపై ఈ సదస్సు జరగనుంది. ఇందులో మద్రాసు ఐఐటీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగ ప్రొఫెసర్ సోమశేఖర్ ఎస్ హిరేమత్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని సదస్సు కో-ఆర్డినేటర్ కె. అరుణ శుక్రవారం తెలిపారు.

రుయాలో అరుదైన శస్త్ర చికిత్సలు

ఇద్దరు చిన్నారుల ప్రాణాలు కాపాడిన వైద్యులు


కోలుకున్న చిన్నారులతో వైద్యాధికారులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 26: రుయాస్పత్రిలో ఇద్దరు చిన్నారులకు రెండు అరుదైన శస్త్ర చికిత్సలు చేసి, వారి ప్రాణాలు కాపాడారు. సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు శుక్రవారం ఆస్పత్రిలో మీడియాకు వివరాలు తెలిపారు. నెల్లూరుకు చెందిన చైత్ర(6), రాజస్థాన్‌కు చెందిన కెల్నా(4) చిన్నారులకు తలలో సమస్య ఉండటంతో వారి తల్లిదండ్రులు పది రోజుల కిందట రుయాస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించగా.. ఇద్దరు చిన్నారులు సెరెబ్రల్ అబ్సెస్ అనే మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. దీంతోపాటు కాంగినిటల్ సైనోటిక్ హార్ట్ డిసీజ్ కూడా ఉన్నట్లు తేలింది. ఇటువంటి హార్ట్ సమస్యతో ఉన్న చిన్నారులకు సాధారణ అనస్థీషియా ఇచ్చి మెదడుకు సంబంధించిన సర్జరీ చేయడం కష్టం. న్యూరో సర్జరీ, అనస్థీషియా వైద్యులు సుదర్శన అగర్వాల్, అనంత కిరణ్, రాధా, వివేకానంద, వంశీ, పవిత్ర ఆధ్వర్యంలో చిన్నారులకు లోకల్ అనస్థీషియా(తల భాగం వరకే మత్తు మందు) ఇచ్చి అతికష్టంపై అరుదైన శస్త్ర చికిత్సలను నాలుగు రోజుల కిందట విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం చిన్నారులు కోలుకోవడంతో వీరిని శుక్రవారం డిశ్చార్జి చేస్తున్నట్లు రవిప్రభు తెలిపారు. వైద్య బృందాన్ని అభినందించారు. ఏఆర్ఎంవో డాక్టర్ హరికృష్ణ, క్లినికల్ పర్యూజనిస్టు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా మరోసారి అవకాశం ఇవ్వండి



టీడీపీ నాయకుడు మన్నారపు వెంకటరత్నయ్యతో మాట్లాడుతున్న వెలగపల్లి వరప్రసాద రావు - చెన్నూరు దళితవాడలో స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వెలగపల్లి

బాలాయపల్లి/గూడూరు, ఏప్రిల్ 26: తిరుపతి ఎంపీగా ఒకసారి పనిచేసిన అనుభవం ఉందని అప్పట్లో తాను చేసిన అభివృద్ధే ఇప్పటికీ కనబడుతోందని మరోసారి తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు అన్నారు. శుక్రవారం బాలయపల్లి మండలం జయంపు గ్రామంలో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. తాను ఎప్పుడు అందుబాటులో ఉంటానని సమస్యలను పరిష్కరించడంలో ముందుంటానన్నారు. అనంతరం టీడీపీ నాయకుడు మన్నారపు వెంకటరత్నయ్య ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. తన గెలుపునకు సహకరించాలని కోరారు. ఏ అవసరం వచ్చినా తాను అందుబాటులోఉంటానని హామీ ఇచ్చారు.

గూడూరు అభివృద్ధికి ఎంతో కృషి...

గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు ఎన్నో సమస్యలను పరిష్కరించానని ఎంతో అభివృద్ధి చేశానని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం సాయంత్రం గూడూరు మండలం చెన్నూరు గ్రామంలో దళితవాడలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దళితుల సమస్యల పట్ల తాను చిత్తశుద్ధితో పనిచేస్తానని చెప్పారు. అనంతరం గూడూరు పట్టణంలో టీడీపీ, జనసేన నాయకులతో భేటీ అయ్యారు. కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు.

నేడు, రేపు ఐపీఎల్ ఫ్యాన్‌పార్కు

తుమ్మలగుంట మైదానంలో ఏర్పాట్లు

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 26: క్రికెట్ అభిమానులను అలరిస్తున్న ఐపీఎల్ (ఇండియన్ ప్రీమియర్ లీగ్) మ్యాచ్‌ల ఫ్యాన్‌పార్కు శని, ఆదివారాల్లో తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట మైదానంలో ఏర్పాటుచేసినట్లు బీసీసీఐ ప్రతినిధి ఇర్ఫాన్‌దాదన్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తుమ్మలగుంట మైదానంలో దాదాపు 8వేలమంది మ్యాచ్‌లను వీక్షించే అవకాశముందని చెప్పారు. రెండ్రోజులపాటు మధ్యాహ్నం 3.30నుంచి రాత్రి 11.30గంటల వరకు రెండు మ్యాచ్‌ల చొప్పున జరుగుతాయన్నారు. ప్రతి మ్యాచ్‌కి లక్కీడ్రా ఉంటుందని, విజేతలకు క్రీడాకారులు ధరించే జెర్సీని ఉచితంగా అందజేస్తామన్నారు. ప్రవేశం ఉచితమని నగరం, చుట్టుపక్కల ప్రజలు, అభిమానులు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో చిత్తూరుజిల్లా గర్ల్స్ అండ్ బాయ్స్ క్రికెట్ అసోసియేషన్ ట్రెజరర్ సి.బి.మధుకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి టి.ప్రణీత్‌స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

ఇదీ సంగతి

కండువా కప్పేశారు


వైసీపీ కండువాలో పూల ఆనంద్



తిరిగి టీడీపీలో చేరిన పూల ఆనంద్

మామా వైసీపీ కండువా వేసుకో.. గెలిచాక నీకేం కావాలో అడిగి పండగ చేసుకో.. అంటూ తమ క్లాస్మేట్ మెడలో బలవంతంగా బులుగు కండువాను వేసేశారు పాత మిత్రులు. అయితే వారం తిరగకుండానే సదరు వ్యక్తి టీడీపీలో చేరి ఆ పాతమిత్రులను కంగుతినిపించారు. ఇంతకీ ఆయనెవరంటే శ్రీకాళహస్తికి చెందిన పూల ఆనంద్. హైదరాబాదులో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఉన్నారు. టెన్త్‌లో ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఈయన క్లాస్‌మేట్. ఇంటర్‌లో ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి బ్యాచ్‌మేట్. అయితే ఈయన మాత్రం తొలి నుంచీ టీడీపీనే. ఒక భూవివాదంలో వారం కిందట అంజూరు శ్రీనివాసులును కలిశారు. ఇక్కడే ఆయన మెడలో బులుగు కండువా పడిపోయింది. అదెలాజరిగిందో ఆయన మాటల్లోనే చదవండి... 'అంజూరు శ్రీనివాసులు ఇంట్లో నేను ఉన్నపుడు అక్కడకి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి వచ్చారు. పాత స్నేహితులం మాట్లాడుకుంటూ ఉండగానే నా మెడలో వైసీపీ కండువా కప్పేశారు. గొడవ పడలేక వచ్చేశాను. అయితే మర్నాడు ఆ ఫోటోను వైరల్ చేశారు. పైగా పార్టీ మారినందుకు నేను రూ.20 లక్షలు తీసుకున్నానని అబద్ధాలు ప్రచారం చేశారు." అంటూ ఆయన బొజ్జల సుధీర్ రెడ్డిని కలిసి తాను టీడీపీలోనే ఉన్నానని స్పష్టం చేశారు. స్నేహాన్ని కూడా రాజకీయాల్లోకి ఈడ్చేస్తారా అని శ్రీకాళహస్తి ప్రజలు విస్తుపోయారు.

- శ్రీకాళహస్తి

అన్యాయం గదా డాక్టర్!



డాక్టర్‌తో ఆ పేషెంట్ గొంతు పెంచి అరుస్తున్నట్టుగా మాట్లాడుతూ ఉంటే ఓపీలో ఉన్నవాళ్లంతా గుమికూడారు. నర్సులు డాక్టర్‌కి రక్షణగా నిలబడ్డారు. 'చూడండి సార్ ఈ అన్యాయం' అని తన సహ పేషెంట్ల వైపు చూశాడు అతను. ఏమైంది అన్నట్టుగా అందరూ ముఖాలు పెట్టారు.

'పేదోళ్లకి ఒక వైద్యం.. పెద్దోళ్లయితే ఇంకో వైద్యం చేస్తే ఎట్ల సార్?' అన్నాడతను అదే గొంతుతో.

జరిగింది ఏమిటంటే.. వారం కిందట అతను బైకుమీద నుంచి పడ్డాడు. నుదుటికి దెబ్బతగిలి బొటబొటా రక్తం కార్చుకుంటూ ఆసుపత్రికి వచ్చాడు. డాక్టర్ తుడిచి నాలుగు కుట్లు వేసి, బ్యాండేజ్ అతికించి వారం తర్వాత రా అని పంపించాడు. వారం తర్వాత వచ్చిన ఆ పేషెంట్ ఇప్పుడు డాక్టర్‌తో గొడవ పడుతున్నాడు.

'చూడండి సార్.. ఇంక బ్యాండేజ్ వద్దు. తీసెయ్ అంటా ఉండాడు ఈ డాక్టర్' అన్నాడతను కంప్లైయినింగ్‌గా..

'నీకు మెడకాయమింద తలకాయ ఉండాదా.. గాలి తగిలి గాయం ఆరాల.. బ్యాండేజి అట్నే ఉంటే సెప్టిక్ అయిపోతాది అని గదా సార్ చెప్తావుండేది' అని నర్సు విరుచుకుపడింది.

అతను మాత్రం తగ్గలేదు.

'మరి చిన్న గులకరాయి తగిలితే ఆయప్పకి మాత్రం ఇన్ని రోజులైనా బ్యాండేజీ తీయలేదు ఎందుకు? నేను ఇచ్చేదీ డబ్బులే కదా.. నాకూ వైద్యం అట్నే గదా చెయ్యాల?' అని నుదిటి మీద ఉన్న బ్యాండేజీని తడుముకుంటూ అతను ప్రశ్నించాడు.

డాక్టర్‌కి ఏం జవాబు చెప్పాలో తెలీక బిక్క మొహం వేసుకుని చూశాడు. జనం మాత్రం జగన్‌ను తలచుకుని నవ్వుకుంటూ ఉండిపోయారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

చిత్తూరు జిల్లా కార్వేటినగరానికి చెందిన మునస్వామి రేటు తక్కువని తన సమీపంలో తమిళనాడు పరిధిలోని పల్లెపట్టు బంకుకు వచ్చి ట్రాక్టరులో డీజిల్ వేయించుకుంటారు. ఆయనే కాదు అక్కడి ద్విచక్ర వాహన చోదకులూ ఇక్కడికే వచ్చి పెట్రోలు కొనుక్కుంటారు. తడ మండల గ్రామాలవారు తమకు దగ్గరగా ఉన్న తమిళనాడు పరిధిలోని ఆరంబాకం, ఎళావూరు వెళ్లి బంకుల్లో పెట్రోలు,డీజిల్ వేయించుకుంటారు. కర్ణాటక సరిహద్దులోని ఆంధ్రా వాసులు కూడా తమకు దగ్గరలోని పొరుగు రాష్ట్ర బంకులకే క్యూ కడతారు.

- తిరుపతి(నేరవిభాగం)







పెట్రోలు లీటరు ధర రూ.లలో			
సంవత్సరం	తిరుపతి	తమిళనాడు	కర్ణాటక
2018	75.13	74.93	75.13
2024	109.52	103.88	102.95

డీజిల్ లీటరు ధర రూ.లలో			
సంవత్సరం	తిరుపతి	తమిళనాడు	కర్ణాటక
2018	69.10	69.10	68.92
2024	97.35	92.34	93.18

వ్యాట్

ఈజ్ దిస్ బాదుడు జగనా

- వైసీపీ పాలనలో పెట్రోలు,డీజిల్ ధరలపై అమాంతం వ్యాట్ పన్ను పెంపు
- దేశంలోనే లేని రేట్లతో మోయలేని భారం
- గగ్గోలు పెడుతున్న వాహన యజమానులు

జగన్ గత ఎన్నికల ప్రచార సభల్లో బాదుడే బాదుడు అంటూ విమర్శలు గుప్పించారు. తాను అధికారంలోకి రాగానే ధరలన్నీ కిందకు దించేస్తానని జనాన్ని ఆశల పల్లకిలో ఊరేగించారు. తీరా అధికార పగ్గాలు చేపట్టేక అసలైన బాదుడెలా ఉంటుందో చూపించారు. కేంద్రం ధరలు నిర్ణయించే పెట్రోలు,డీజిల్‌పైనా తన ప్రతాపం చూపించారు. పొరుగు రాష్ట్రాలే నయమనిపించేలా పెంచేశారు. 2022 నుంచి దేశంలోనే ఎక్కడా లేనంతగా రాష్ట్ర వాటా కింద వ్యాట్, రోడ్డు అభివృద్ధి సెస్‌ల పేరుతో అదనపు వడ్డనకు దిగారు.

బండి తీయాలంటేనే భయం

గతంలో లీటరు పెట్రోలుపై రాష్ట్ర ప్రభుత్వం వ్యాట్ రూ.11.95 వసూలు చేసేది. జగన్ అధికారంలోకి వచ్చిన రెండేళ్ళ తర్వాత వ్యాట్ పెంచుకుంటూ పోయారు. దేశంలో ఎక్కడా లేని రోడ్డు అభివృద్ధి పన్ను కూడా ఈ భారానికి జోడించారు. దీంతో 2022లోనే ఇంధనంపై వ్యాట్ రూ.15.44కి చేరుకుంది. ఇప్పుడది ఇంకా పెరిగిపోయింది. తాజాగా పెట్రోలు ధర తీరును పరిశీలిస్తే డీలర్‌కు లీటర్ రూ.60.39కి విక్రయిస్తుండగా ఎక్సైజ్ డ్యూటీ కింద రూ.19.90 వేస్తున్నారు. డీలర్ కమీషన్‌గా రూ.2.84, వ్యాట్ రూపంలో ఏకంగా రూ.26.39 వసూలు చేస్తున్నారు. వ్యాట్ అమాంతం పెంచేయడంతో ఇంధన వినియోగదారులు బండి తీయాలంటేనే భయపడుతున్నారు.

వినియోగదారులకు డీ'జెల్ల'

వ్యాట్ ప్రభావంతో డీజిల్ ధరలూ పెరిగి ఆటో డ్రయివర్లు లాంటి చిన్న బతుకుల నడ్డి విరిచింది. లీటర్ డీజిల్ డీలరుకు రూ.50.47కి విక్రయిస్తుండగా ఎక్సైజ్ డ్యూటీ కింద రూ.17.65, డీలరు కమీషన్‌గా రూ.2.84,వ్యాట్ రూపంలో రూ.26.39 వసూలు చేస్తున్నారు. దీంతో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన బంకుల్లో ధరలు అధికంగా ఉంటున్నాయని వాహన చోదకులు గగ్గోలు పెడుతున్నారు. తమపై జగన్‌కు నిజమైన ప్రేమాభిమానముంటే వ్యాట్ తగ్గించి ఇంత భారం మోపేవారుకాదంటున్నారు వాహన చోదకులు. బయటకు దొరక్కుండా ఇంధన ధరలతో బాదేసి పరోక్షంగా అన్ని ధరలూ పెరిగేలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దారుణంగా దోచేస్తున్నారు

జగన్ వచ్చినప్పటి నుంచి పెట్రోలు,డీజిల్ ధరలు పెరిగిపోయాయి. దీనికితోడు .రోజూ ఎక్కడో ఒక చోట పోలీసులు అన్యాయంగా మా ఆటో డ్రయివర్లపై పెనాల్టీలు వేస్తూనే వున్నారు. వారంలో రూ.500 నుంచి రూ. 800 వరకు చలానాలు కడుతున్నాం. మా నుంచి దోచుకుంటున్నారేగాని పైసా ఉపయోగం లేదు.

- శ్రీనివాస్, ఆటో డ్రైవర్, మంగళం

ఏమీ మిగలడం లేదు

లారీలు, వ్యాన్లు బాడుగకు అడిగేవారే లేకుండా పోయారు. లోనులో బండి తీసి ఖాళీగా పెట్టుకుంటున్నాను. అయినా క్వార్టర్ ట్యాక్స్ కట్టాల్సిందే. చంద్రబాబు హయంలో క్వార్టర్ ట్యాక్స్ రూ. 800 కట్టేవాళ్ళం. దాన్ని రద్దు చేసి జగన్ లైఫ్ ట్యాక్స్ పేరుతో రూ.38,000 వసూలు చేస్తున్నారు. ఇది కాకుండా గ్రీన్ ట్యాక్స్ మరో 1200కట్టాలి. ఇవన్నీ భరించలేక బండ్లు అమ్ముకుంటున్నాం.

- గోపి, ఐషర్ వాహనం, తిరుపతి

పరమ చెత్త ప్రభుత్వం

ఇది పరమ చెత్త ప్రభుత్వం. ఏ వర్గాన్ని వదలి పెట్టడంలేదు. పెట్రోలు ధరలు విపరీతంగా పెంచేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ లీటరు రూ.109.52 వుంది. గతంలో రూ.700కి స్కూటర్ ట్యాంకు నిండిపోయేది. ఇప్పుడు రూ. 1150కి పట్టుకుంటే ట్యాంకు నిండతా వుంది. జగన్ వ్యాట్‌తో దారుణంగా బాదేస్తున్నారు.

- రామచంద్ర, మధురానగర్



శ్రీకాళహస్తి చరిత్ర

రాజకీయ ఆధ్యాత్మిక క్షేత్రం



ఆధ్యాత్మికంగానే కాదు రాజకీయంగానూ విశిష్టతను సంతరించుకుంది శ్రీకాళహస్తి. ఇక్కడి సుప్రసిద్ధ శైవక్షేత్రం నిరంతరం భక్తులతో సందడిగా వెలుగొందుతుంది. మరో పక్క ఇక్కడ రాజకీయం కూడా వాడీవేడీగా ఉంటుంది. రాష్ట్రపతి పదవిని అలంకరించిన తెలుగు తేజం నీలం సంజీవరెడ్డి తొలినాళ్లలో 1953 ఉప ఎన్నికల్లో ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలిచి ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. వారసత్వ రాజకీయాలకూ ఈ అసెంబ్లీ నియోజకవర్గం పెట్టింది పేరు. అద్దూరి బలరామిరెడ్డి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలవగా ఆయన కుమారుడు దశరథరామిరెడ్డి ఒక పర్యాయం ఎన్నికయ్యారు. అలాగే బొజ్జల గంగ సుబ్బరామిరెడ్డి ఒకసారి ఎమ్మెల్యేగా గెలుపొందగా ఆయన కుమారుడు గోపాలకృష్ణరెడ్డి ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తాజా ఎన్నికల్లో ఈ కుటుంబం నుంచి గోపాలకృష్ణరెడ్డి తనయుడు సుధీర్‌రెడ్డి టీడీపీ అభ్యర్థిగా తలపడుతున్నారు. ఇక్కడ నుంచి గెలుపొందిన ముగ్గురు రాష్ట్ర మంత్రులయ్యారు. 1962లో గెలిచిన అద్దూరి బలరామిరెడ్డి విద్యాశాఖ మంత్రి అయ్యారు. బొజ్జల గోపాలకృష్ణరెడ్డి మూడు పర్యాయాలు మంత్రి పదవి నిర్వర్తించారు.

- శ్రీకాళహస్తి

నియోజకవర్గం ఏర్పడింది: 1952
ఎన్నిసార్లు ఎన్నిక జరిగింది:17

నియోజకవర్గం స్వరూపం:
శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాలు, శ్రీకాళహస్తి మున్సిపాలిటీ

ఎమ్మెల్యేలు
- 1952 - అద్దూరి బలరామిరెడ్డి - కాంగ్రెస్
- 1953 -నీలం సంజీవరెడ్డి - కాంగ్రెస్
- 1955 - పత్ర సింగరయ్య - కాంగ్రెస్
- 1962- అద్దూరి బలరామిరెడ్డి - కాంగ్రెస్
- 1967- బొజ్జల జీయస్ రెడ్డి - స్వతంత్ర
- 1972 - అద్దూరి బలరామిరెడ్డి - స్వతంత్ర
- 1978 - ఉన్నం సుబ్రహ్మణ్యనాయుడు -కాంగ్రెస్
- 1983 - అద్దూరి దశరథరామిరెడ్డి- తెలుగుదేశం
- 1985 - సత్రవాడ మునిరామయ్య - తెలుగుదేశం
- 1988(ఉప ఎన్నిక) - తాటిపర్తి చెంచురెడ్డి - కాంగ్రెస్
- 1989,94,99 -బొజ్జల గోపాలకృష్ణారెడ్డి - తెలుగుదేశం
- 2004- ఎస్‌సీవీ నాయుడు - కాంగ్రెస్
- 2009, 2014- బొజ్జల గోపాలకృష్ణారెడ్డి - తెలుగుదేశం
- 2019 - బియ్యపు మధుసూదనరెడ్డి - వైసీపీ

మొత్తం ఓటర్ల సంఖ్య : 2,47,844
పురుషులు : 1,19,658
మహిళలు: 1,28,172
ఇతరులు : 14

జంపింగ్ జపాంగ్

అటునిటు దూకి...


బుధవారం పల్లం సర్పంచ్ గోపాల్‌యాదవ్‌ను కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న బొజ్జల సుధీర్‌రెడ్డి


గురువారం టీడీపీ నుంచి వైసీపీలో చేరుతూ ఎమ్మెల్యే చేతుల మీదుగా కండువా కప్పుకుంటున్న పల్లం సర్పంచు చీమల గోపాల్ యాదవ్

ఏర్పేడు మండలంలో పల్లం పంచాయతీ సర్పంచు చీమల గోపాల్‌యాదవ్ గత కొన్నాళ్లుగా వైసీపీపై అసంతృప్తితో దూరంగా ఉన్నారు. బుధవారం ఆయన శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. అయితే ఏమైందో ఏమోగానీ, అదే చీమల గోపాల్ యాదవ్ గురువారం సాయంత్రం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైసీపీలో చేరుతున్నట్టు ఫోటో ప్రత్యక్షం అయ్యింది.

-ఏర్పేడు

ఇదేనా సాగునీటి భరోసా

- సాగునీటికి పైసా విదల్చని ప్రభుత్వం
- ఆగిపోయిన ప్రాజెక్టుల ఆధునికీకరణ
- తీవ్రంగా నిరసిస్తున్న అన్నదాతలు






అన్నదాత పక్షపాతిని. రైతు సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం. సాగునీటి రంగ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. రైతు భరోసా విడుదల లాంటి సందర్భాల్లో సీఎం జగన్ ఊదరగొట్టే మాటలివి. ఆచరణలో ఆయన మాటలన్నీ నీటిమూటలేనని ఐదేళ్ల అనుభవంలో రైతులందరికీ అర్థమైంది. సత్యవేడు నియోజకవర్గంలో జగన్ ప్రభుత్వం పైసా విదల్చక ఆగిపోయిన నీటి ప్రాజెక్టులే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి.. సాగు రంగాన్ని జగన్ నీరుగార్చారని అన్నదాతలు దుమ్మెత్తిపోస్తున్నారు.

- సత్యవేడు

అటకెక్కిన ఆరణియార్ ఆధునికీకరణ

ఆరువేల ఎకరాల ఆయుకట్టుకు ఆధారమైన ఆరణియార్ ఆధునికీకరణను జగన్ సర్కార్ పూర్తిగా విస్మరించింది . పిచ్చాటూరు,నాగలాపురం మండలాల్లో రైతులకు మేలు చేసే ఈ ప్రాజెక్టు ఆధునికీకరణకు 2017లో నాటి టీడీపీ ప్రభుత్వం రూ.35 కోట్లు విడుదల చేసింది. 2019 ప్రథమార్థంలో పనులు ప్రారంభమయ్యాయి. అదే ఏడాది వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పనులు అటకెక్కాయి. కాంట్రాక్టరుకు సకాలంలో ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. అప్పటి నుంచి అతీగతి లేదు. ప్రాజెక్టు ఆధునికీకరణ పూర్తిస్థాయిలో జరిగితే ఏటా రెండు పంటలు సాగు చేయవచ్చు.


కేవీబీపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్

కలగా కాళంగి ఆధునికీకరణ

కేవీబీపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్ ఆధునికీకరణ అమలుచేయని హామీల చిట్టాలో మిగిలిపోయింది. నాలుగేళ్ళలో ప్రాజెక్టు అభివృద్ధికి ఈ ప్రభుత్వం పైసా కూడా విడుదల చేయలేదు. మూడు టీఎంసీల సామర్థ్యానికి పెంచుతామన్న నేతల మాట నెరవేరలేదు. ఇటీవల గేట్ల మరమ్మతులకు మొక్కుబడిగా రూ.10 లక్షలు విడుదల చేసి ప్రభుత్వం చేతులు దులుపుకొంది.

- నారాయణవనం మండలంలోని వెత్తలతడుకు, తిరువట్యం ప్రాజెక్టులకు 2005లో భూమిపూజ జరిగింది. ప్రాజెక్టుల పనులు పూర్తయి పదేళ్లవుతున్నా కుడి, ఎడమ కాలువల నిర్మాణం పూర్తికాక నిరుపయోగంగా మారింది.
- నాగలాపురం మండలం భూపతీశ్వరప్రాజెక్టు ఆధునికీకరణ మాటలకే పరిమితమైంది. నిల్వ సామర్థ్యం లేక ఏటా కొండ కోనల నుంచి వచ్చే వర్షపు నీరు సముద్రం పాలవుతోంది. సత్యవేడు, నాగలాపురం మండలాల్లో మూడువేల ఎకరాలకు ఈ ప్రాజెక్టే ఆధారం.
- నల్లచెరువు ఎడమ కాలువలో నాలుగేళ్ళ నుంచి పూడికతీత పనులు చేపట్టలేదు. ఆయకట్టులోని 3500 ఎకరాలకు నీరు అందడం గగనంగా మారింది.
- వరదయ్యపాళెం మండలంలోని ఉబ్బలమడుగు ప్రాజెక్టు పరిస్థితి కూడా దయనీయంగా ఉంది.

పోలింగ్ తేదీ మే 13

గుర్తుంచుకోండి

అధికారం మీ చేతుల్లో, ఈవీఎంల వద్ద ఉంది. గుర్తుంచుకోండి.. మే 13 పోలింగ్ తేది.. అంటూ ఓటు విలువను గుర్తు చేస్తూ చిత్తూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్టిక్కర్ల ద్వారా ప్రచారం కల్పిస్తున్నారు. ఓటు హక్కు ప్రాధాన్యత, పోలింగ్ తేదీపై అవగాహన కోసం ప్రత్యేకంగా స్టిక్కర్లను రూపొందించారు. వీటిని గ్యాస్ సిలిండర్లపై అతికించి సరఫరా చేస్తున్నారు. ఆటోలు, జనం ఎక్కువగా గుమికూడే దుకాణాలు, రద్దీ ప్రాంతాల్లోనూ వీటిని అతికిస్తున్నారు.





- చిత్తూరు

ఒకప్పట్లో 21 ఏళ్లకు ఓటు

ఎట్టెట్టా..

దేశంలో మొదటి సాధారణ ఎన్నికలు 1952లో ఎన్నికల కమిషనర్ సుకుమార్ సైన్ ఆధ్వర్యంలో జరిగాయి. అప్పట్లో 17.90 కోట్ల మంది ఓటర్లు. అప్పటి నుంచి 1985 వరకు జరగిన ఎన్నికల్లో 21 ఏళ్ల నిండిన వారికే ఓటు హక్కు కల్పించారు. రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యాక 1988లో 61వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఓటు హక్కు వయస్సును 18 ఏళ్లకు తగ్గించారు.



- చిత్తూరు

పోస్టల్ బ్యాలెట్‌లో గుర్తులుండవు

మీకు తెలుసా?

గుర్తులు లేకుండా ఎన్నికలు ఏమిటా అని సందేహం రావచ్చు. ఇది నిజమే! పోస్టల్ బ్యాలెట్‌లో పార్టీ గుర్తులుండవు. అభ్యర్థి, పార్టీ పేర్లు మాత్రమే ఉంటాయి. సార్వత్రిక ఎన్నికల రోజు విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించిన వ్యక్తులు పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగిస్తారు. అంతకుముందు బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరిగే సమయంలో సాధారణ ఓటర్లకు ఇచ్చే బ్యాలెట్ పత్రాన్ని ఉద్యోగులకు ఇచ్చేవారు. వచ్చినవాటిలో చివరివాటిని తీసి పోస్టల్ ఓటు వేసే ఉద్యోగులకు అందించేవారు. ఈవీఎంలు వచ్చాక వీరికి పోస్టల్ బ్యాలెట్‌ను ఏర్పాటు చేశారు. దీన్నిబట్టి వారి నియోజకవర్గం ప్రాంతంలో పోటీచేసే అభ్యర్థి పేరు, పార్టీ పేరు ముద్రిస్తారు. గుర్తు ఉండకపోవడంతో అభ్యర్థి పేరు పక్కన టిక్ చేయాల్సి ఉంటుంది.



- చిత్తూరు కలెక్టరేట్



● 'కోతల' జగన్

రైతు భరోసా అంటే.. ఊరూరా కేంద్రాలు నిర్మించడం. వాటికి అధికారపార్టీ జెండా రంగులు వేయడం. సీఎం జగన్ బొమ్మను చిత్రించడం. కరెంటు కోతలు.. ఆగిన రాయితీలు.. అందని ప్రభుత్వ సాయాలు. ఇంతేనా..?

కానే కాదు.. నిరంతర విద్యుత్తు సరఫరా, రాయితీలతో రైతులను ఆదుకోవడమే నిజమైన భరోసా. ఈ దిశగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల ప్రభుత్వాలు రైతులకు అండగా నిలుస్తున్నాయి.

అందుకే.. ప్రస్తుతం కుప్పం నియోజకవర్గంలోని కొందరు రైతులు ఎండిపోయిన పంటల దగ్గర గుండెనిండా దుఃఖంతో కుములుతుంటే, పొలాలను బీళ్లు పెట్టుకుని మరికొంతమంది పశువుల కాపరులుగా మారుతున్నారు. ఆ పశువుల మేతకు వేసిన గడ్డిమళ్లూ నీరందక మలమలమాడుతుంటే అచేతనంగా చూస్తున్నారు. కాస్త సరిహద్దులు దాటి చూస్తే.. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని రైతులేమో పంటల సాగుతో సంతృప్త జీవనం సాగిస్తున్నారు.

జిల్లా సరిహద్దుల్లోని మూడు రాష్ట్రాల పరిధిలో వ్యవసాయం, ప్రభుత్వ ప్రోత్సాహాలను 'ఆంధ్రజ్యోతి' పరిశీలించింది. దీనిపై ప్రత్యేక కథనం అందిస్తోంది.

- కుప్పం



కలికానికీ కనిపించని రైతు 'భరోసా'

● ఆగిన సబ్సిడీలు, విద్యుత్తు కోతలతో అన్నదాత సతమతం

● తమిళనాడు, కర్ణాటకల్లో ప్రభుత్వ ప్రోత్సాహంతో పండగలా మారిన వ్యవసాయం

ఏపీ: ఎండుతున్న పంటలు

కుప్పం మండలం చందం వద్ద కరెంటు కోతలతో ఎండిన టమోటా తోట

కుప్పం నియోజవర్గంలో ఉద్యాన పంటలు అధికం. రాగి, వరి వంటి సంప్రదాయ పంటలూ సాగు చేస్తున్నారు. బోర్లలో అరకొరగా నీళ్లున్నా.. పంటలకు అందించేందుకు విద్యుత్తే ఉండడం లేదు. వ్యవసాయానికి 9 గంటల కరెంటు ఇస్తున్నామని అధికార పార్టీ ఊదరగొడుతోంది. పేరుకు ఉదయం 8.30 గంటలకు, మధ్యాహ్నం 1.30 గంటలకు రెండు షిఫ్టుల్లో ఇస్తున్నామంటున్నారు. కానీ, ఈ కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. ఒకసారి నీళ్ల పైకెత్తి కొద్దిదూరం పారేసరికి కరెంటు పోతుంది. మళ్లీ కరెంటు వచ్చేలోపల ఈ పారిన నీరు పూర్తిగా ఎండిపోవడంతో తిరిగి మొదటినుంచీ పారగట్టాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. ఇలా కోతలుపోను, కేవలం 4 గంటలపాటే కరెంటు ఉంటోందని చెబుతున్నారు. కోతలవల్ల కొరత పడిన కరెంటును అర్ధరాత్రి ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. అప్పుడూ కరెంటు దైవాధీనమేనట. ఇక, ఏనుగుల భయంతో రైతులు రాత్రిళ్ల చేలల్లోకి వెళ్లడంలేదు. చాలామంది రైతులు పొలాలను బీళ్లు పెట్టుకుంటుంటే, ఇంకొందరు సేద్యం మానేసి కూలీలుగా, పశువుల కాపరులుగా మారిపోతున్నారు.

'భరోసా' ఉత్తిదే

● **తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో..** కుప్పంలోని హార్టికల్చర్ హబ్‌లో రైతులకు టమోటా, మిర్చి నార్లు ఉచితంగా పంపిణీ చేసేవారు. అరటితో పాటు బీన్స్, చిక్కుడు వంటి పందిరి తోటలకు ఎకరాకు 30 శాతం రాయితీ అందించేవారు. రొటేవేటర్లు, ట్రాక్టర్లు క్రాప్ కట్టర్స్, టార్పాలిన్లు వంటి వాటికి గరిష్ఠంగా 60 శాతం సబ్సిడీ అందేది. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులనూ సబ్సిడీపై ఇచ్చేవారు. పట్టుపురుగుల షెడ్లకు, పెంపకానికి తగిన ప్రోత్సాహకాలు ఉండేవి. డ్రిప్‌లకు 90 శాతం సబ్సిడీ ఉండేది.

● **వైసీపీ హయాంలో..** ఊరూరా రైతు భరోసా కేంద్రాలు పెట్టడం తప్ప జగన్ పాలనలో సబ్సిడీలు అందలేదు. సుమారు రెండున్నరేళ్ల క్రితం డ్రిప్‌లకు సబ్సిడీ ఇచ్చారు కానీ, తర్వాత అది కూడా ఆగిపోయింది. తప్పదారి ఎప్పుడైనా ఎరువుల పంపిణీ జరిగినా, అవి అధికార పార్టీ నాయకులకు తప్ప సామాన్య రైతులకు అందడంలేదు. బైవోల్టిన్ పట్టుగూళ్లకు పట్టు పరిశ్రమ శాఖ ద్వారా కిలోకు రూ.50 వంతున టీడీపీ హయాంలో ఇచ్చిన ప్రోత్సాహం ఇప్పుడు లేదు. అంటే రైతును జగన్ ప్రభుత్వం అనాథగా వదిలేసింది.



కరెంటుతో ఏగలేకే బీడు పెట్టేసినా

ఇదిగో చూస్తావుండారు గదా. ఇదంతా నా పొలమే. మొత్తం రెండెకరాలు. ఏసిన డ్రిప్ పైపులు పీకేసి బీడు పెట్టేసినా. ల్యాకపోతే ఏంది? కరంటు ఎప్పుడు వొస్తాదో, ఎప్పుడు పోతాదో తెలీదు. వొచ్చినా సుద్దంగా ఒక కాలుగంట నిలవదు. ఇంగ ఎక్కడ పంటకు నీల్లు పారతాయి. అప్పులు పెరిగిపొయ్యినాయా సామీ. అందుకే బీడు పెట్టేసి, రొండుమూడు ఆవులు పట్టుకోని సాకతా ఉండా. ఓటికి గెడ్డి దొరకడం గూడా కష్టమైపోతా వుండాది.

- గురుమూర్తి, చందం, కుప్పం మండలం



కళ్లల్లో నీళ్లు తిరగతావుండాయి

నాకు రెండున్నరెకరాల పొలం. అందులోనే మల్బరీ, రాగులు, పశువుల గడ్డి ఏసుకున్నా. బోర్లో నీల్లుండాది. కానీ పారగట్టేకి కరంటుడల్ల గదా. ఇదిగో.. ఈ గెడ్డి మొక్కలు నిలవనా ఎండిపోతా వుండాయి. నేను ఆరేడు పశువులు పెంచుకుంటా వుండా. ఓటికి మేత దక్కడంలేదు. ఏరేవోల్ల దగ్గర గెడ్డి కొనుక్కోనొచ్చి ఏస్తావుండా. మల్బరీ, రాగి వంటి పంటలకు అప్పట్లో సబ్సిడీలు ఇచ్చేవోళ్లు, పంట నష్టపోతే నష్టపరిహారమూ అందేది. ఇప్పుడటువంటివేమీ లేదు. కనీసం ఎరువులు, పురుగుమందులు కూడా ఇయ్యడంలేదు.

- ఎం.కృష్ణప్ప, అగరం, గుడుపల్లె మండలం

తమిళనాడు: చేలు పచ్చగా..



తమిళనాడు రాష్ట్రం చిగురుమాకులపల్లెలో కళకళలాడుతున్న రైతు స్వీట్‌కార్న్ తోట

గుడుపల్లె మండలం ఓఎన్ కొత్తూరుకు సుమారు నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఉన్న తమిళనాడు రాష్ట్రం వేపనపల్లె పంచాయతీలోని చిగురుమాకులపల్లెను పరిశీలిద్దాం. ఇక్కడ వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తు సరఫరా అవుతోంది. బోర్ల నుంచి నీటిని పారిస్తున్నారు. దీంతో ఎటు చూసినా చేలు పచ్చని పంటలతో కళకళలాడుతున్నాయి. ఈ ఒక్క గ్రామమే కాదు.. తమిళనాడు రాష్ట్రంలో ఏ పల్లెలోనైనా వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తును అక్కడి ప్రభుత్వం సరఫరా చేస్తున్నట్లు అక్కడి రైతులు ఆనందంగా చెప్పారు. పంట సబ్సిడీలు, నష్టపరిహారాలు, ప్రోత్సాహకాలు, సబ్సిడీమీద వ్యవసాయ పరికరాలు తమకు పుష్కలంగా అందుతున్నాయని తెలిపారు.



కరెంటుకు కోతలంటే మాకు తెలీదు

మాకు కరెంటు కోతలంటే ఏందో తెలియదు. రోజులో ఎప్పుడు మోటారు వేసినా రన్ అవుతుంది. అందుకే నాకున్న ఆరెకరాల్లో అరటి, టమోటో, స్వీట్ కార్న్ పండిస్తున్నా. కరెంటు లేకుండా పంటలు ఎండిపోవడమన్నది మేము ఇంతదాకా చూడలేదు. పంటలకు సబ్సిడీలు కూడా మా ప్రభుత్వం బాగానే ఇస్తోంది.

- పెద్దన్న, చిగురుమాకులపల్లె గ్రామం, తమిళనాడు రాష్ట్రం

కర్ణాటక: రైతు మోములో నవ్వులు



బెండవారంలో కళకళలాడుతున్న బీన్స్ తోట

ఇక, కుప్పం నియోజకవర్గానికి పొరుగున ఉన్న ఇంకో రాష్ట్రం కర్ణాటక విషయానికి వస్తే.. అక్కడా ప్రభుత్వంఅనేక రకాలుగా రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. రాగి, టమోటా, మామిడి, వేరుశనగ, అరటి పంటలకు ఎకరాకు రూ.40 వేల దాకా సబ్సిడీ ఇస్తున్నారు. ఏడాదికి రూ.1250 బీమా ప్రీమియం కడితే, ఆయా పంటలకు ప్రకృతి విపత్తులతో జరిగిన నష్టాన్ని బట్టి రూ.30 వేలనుంచి రూ.60 వేలదాకా ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తోంది. వ్యవసాయ పరికరాల కొనుగోళ్లకు ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, బీసీ, ఓసీలైతే 75 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. పురుగు మందుల మీద ఏకంగా 80 శాతం సబ్సిడీ లభిస్తోంది. బస్తా యూరియా మీద 10 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. కందులు, రాగులు వంటి చిరుధాన్యాలకూ సబ్సిడీ లభిస్తోంది. ఇక వ్యవసాయానికి కరెంటు సరఫరా కూడా సంతృప్తికరంగానే ఉంది. ఇక్కడ వ్యవసాయానికి రెండు షిఫ్టుల్లో 7 గంటల కరెంటు ఇస్తున్నారు. కాకుంటే, కోతల్లేకుండా పగలు 3 గంటలు, రాత్రి 4 గంటలపాటు సరఫరా అవుతున్నట్లు రైతులు తెలిపారు.

మాకు సబ్సిడీలు బాగా ఇస్తారు

నేను రెండెకరాల అరటి తోట పెట్టాను. ప్రభుత్వంనుంచి ఎకరాకు రూ.30 వేలు సబ్సిడీ లభించింది. ఇంతేకాదు.. పురుగు మందులు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు కూడా సబ్సిడీమీద గవర్నమెంట్ ఇస్తోంది. ఇప్పుడు ఎండలు ఎక్కువగా ఉన్నాయి. కరెంటు బాగానే ఉండడంవల్ల నీటి సమస్య అంతగా లేదు. ఒకవేళ బోర్లో నీళ్ల ఎండిపోయి, పంట ఎండిపోతే.. ఇన్సూరెన్స్ కట్టాను కాబట్టి ఎకరాకు కనీసం రూ.30 వేల నష్టపరిహారం అందుతుంది.



- రమేశ్, రైతు, బెండవారం, కర్ణాటక రాష్ట్రం

టీడీపీ ప్రచారంలో ఎన్ఆర్ఐ

● నేను సైతం

రాష్ట్రాభివృద్ధి కోసం ఆలోచించే చంద్రబాబును ఆదర్శంగా తీసుకుని ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు యువ ఎన్ఆర్ఐ గుడివాడ చరణ్. బంగారుపాళ్యం మండలం శేషాపురానికి చెందిన ఈయన 2017లో అమెరికా వెళ్లారు. వాషింగ్టన్‌లో కన్సల్టెన్సీని నెలకొల్పి వంద మందికిపైగా ఉపాధి కల్పిస్తున్నారు. వందల కోట్ల టర్నోవర్ ఉంది. మరోవైపు సొంత మండలంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. పేద కుటుంబాల్లో పెళ్లిళ్లు జరిగినప్పుడు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల చదువులకు ఆర్థికసాయం చేస్తున్నారు. పేదలు చనిపోతే దహన సంస్కారాలకు ఆర్థికంగా తోడ్పాటునిస్తున్నారు. చంద్రబాబు స్ఫూర్తితో టీడీపీలోకి వచ్చిన ఆయన పూతలపట్టు నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ప్రస్తుతం పూతలపట్టు నియోజకవర్గ ఎన్ఆర్ఐ కో- ఆర్డినేటర్‌గా ఉన్నారు. విదేశాల్లో నెల రోజులుంటే నియోజకవర్గంలో నెల ఉండి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు మురళీమోహన్, దగ్గుమళ్ల ప్రసాదరావు విజయానికి ప్రచారం చేస్తున్నారు. చంద్రబాబు సీఎం అయితే ఇక్కడే సాఫ్ట్‌వేర్ కంపెనీని నిర్మించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని చరణ్ తెలిపారు.



పాలేరులో ప్రచారం చేస్తున్న ఎన్ఆర్ఐ గుడివాడ చరణ్

- బంగారుపాళ్యం

డిగ్రీ కాలేజీకి భవనాలేవీ?

● ఉదయం ఇంటర్.. మధ్యాహ్నం డిగ్రీ తరగతులు

జీడీనెల్లూరు నియోజకవర్గంలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తా.

- ప్రజాసంకల్ప యాత్ర సందర్భంగా వెదురుకుప్పం మండలంలో జరిగిన రోడ్‌షోలో జగన్ ఇచ్చిన హామీ.

చెవిలో పువ్వు

ఆ మేరకు నాలుగేళ్ల కిందట వెదురుకుప్పం మండలం చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాత్కాలికం పేరుతో డిగ్రీ తరగతులు ప్రారంభించారు. ఉదయం జూనియర్ కళాశాల, మధ్యాహ్నం డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్నారు. నాలుగేళ్ల కిందటే డిగ్రీ కాలేజీ నిర్మాణానికి కొమ్మరగుంట రెవెన్యూ పరిధిలో స్థలాన్ని కేటాయించి శిలాఫలకం కూడా వేశారు. నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఉత్తర్వులు కూడా జారీ చేశారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి మరింత ఉత్సాహంతో ఇక్కడ వైఎస్సార్ విగ్రహాన్ని కూడా ఆవిష్కరించారు. కానీ.. నాలుగేళ్లయినా పునాది రాయి పడలేదు. ఒంటి పూట నిర్వహణతో ఇక్కడ జూనియర్ కాలేజీ బలహీనపడింది. విద్యార్థుల సంఖ్య బాగా తగ్గిపోయింది. డిగ్రీ కాలేజీని మా ప్రాంగణం నుంచి ఎత్తేయాలని జూనియర్ కాలేజీ వాళ్లు ఫిర్యాదు కూడా చేశారు.

- వెదురుకుప్పం



వెదురుకుప్పం డిగ్రీ కళాశాలకు కేటాయించిన స్థలంలో వైఎస్ విగ్రహం

సానుభూతి కోసమే జగన్ స్టిక్కర్ ప్రచారం



ముఖాన స్టిక్కర్లు అతికించుకుని టీడీపీ నాయకుల నిరసన

ఏర్పేడు, ఏప్రిల్ 26: ముఖ్యమంత్రి జగన్ సానుభూతి కోసమే నుదుట స్టిక్కర్‌తో ప్రచారం నిర్వహిస్తున్నారని టీడీపీ నాయకులు ఎద్దేవా చేశారు. శుక్రవారం ఏర్పేడు మండలం గోవిందవరంలో స్థానిక టీడీపీ నేతలు తలలకు స్టిక్కర్లను అంటించుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నేత పేరం చిరంజీవులు నాయుడు మాట్లాడుతూ పెద్ద ఆపరేషన్ జరిగినా వారం రోజుల వ్యవధిలోనే వైద్యులు కట్టు తొలగిస్తారని, 15రోజుల క్రితం గులకరాయి తగిలి చిన్న గాయం అయితే ఇప్పటికీ స్టిక్కరు అంటించుకుని తిరగడం ప్రజల నుంచి సానుభూతి కోసమేనని అన్నారు. జగన్ ఆడే దొంగనాటకలను ఎవరూ నమ్మరని, త్వరలో జరిగే ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పేరం నాగరాజు నాయుడు, మహేష్‌నాయుడు, రమేష్ చౌదరి, మునిరత్నం, చలపతి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే టీడీపీ లక్ష్యం

ఏర్పేడు, ఏప్రిల్ 26: మహిళల ఆర్థికాభివృద్ధే టీడీపీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. శుక్రవారం ఏర్పేడులో మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే మహిళల కోసం అమలు చేసే పథకాలను వివరించారు. ప్రతి మహిళకు ఆర్టీసీ బస్సులు ఉచిత ప్రయాణం, మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునెయ్య, శివశంకర్‌రెడ్డి, రాచేటి సుబ్రహ్మణ్యం, నిరంజన్, గోల్డ్‌మాన్ నాయుడు, రమణయ్య, వరదయ్య, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, కుమార్, చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు తథ్యం: ఆదిమూలం



ఎన్నికల ప్రచారంలో ఆదిమూలం

పిచ్చాటూరు, ఏప్రిల్ 26: త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ గెలుపు తథ్యమని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం అన్నారు. శుక్రవారం పిచ్చాటూరు మండలంలోని వెంగళత్తూరు, రామాపురం, రాజానగరం, వేలూరు, శివగిరి, సిద్ధిరాజు కండ్రిగ, చెంచురాజు కండ్రిగ, అడవి కొడియంబేడు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరాచకాల పెద్దిరెడ్డి ప్రతిపాదించిన ఎమ్మెల్యే అభ్యర్థిని ఇంటికి పంపించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో సతీష్ నాయుడు, తిరుమలరెడ్డి, ఇళంగోవన్‌రెడ్డి, పద్మనాభరాజు, రవి, అరుణ్ ప్రకాష్, రామకృష్ణంరాజు, బుజ్జినాయుడు, సుమాంజలి పాల్గొన్నారు.

అమర ఆస్పత్రిలో 3డీ టెక్నాలజీ ఎంఆర్ఐ

రేణిగుంట, ఏప్రిల్ 26: రేణిగుంట మండలం కరకంబాడి సమీపంలో వున్న అమర ఆస్పత్రిలో అత్యాధునిక త్రీడీ టెక్నాలజీ ఎంఆర్ఐ యంత్రాన్ని, బ్లడ్‌బ్యాంక్‌ను మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, గల్లా రామచంద్రనాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గౌరినేని ప్రసాద్, డాక్టర్ గౌరినేని రమాదేవి, రేడియాలజిస్టు వినోద్, సీవో వేణుగోపాల్, ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజరు నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంఆర్ఐ స్కానింగ్ గదిని ప్రారంభిస్తున్న గల్లా రామచంద్రనాయుడు

శ్రీకాళహస్తి సత్యవేడు

నాలుగు నామినేషన్ల తిరస్కరణ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 26: శ్రీకాళహస్తి అసెంబ్లీ స్థానానికి దాఖలైన నామినేషన్లలో నాలుగింటిని అధికారులు తిరస్కరించారు. టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి రిషితా రెడ్డి నామినేషన్ ప్రత్యామ్నాయంగా నమోదు కావడంతో తిరస్కరించారు. అలాగే వైసీపీ అభ్యర్థి బియ్యపు మధుసూదన్ రెడ్డి సతీమణి శ్రీవాణి రెడ్డి, కుమార్తె పవిత్రా రెడ్డి వైసీపీ ప్రత్యామ్నాయ అభ్యర్థులుగా నామినేషన్ వేయడంతో వాటిని తిరస్కరించారు. బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి మునీశ్వర్ ఫారం-ఏ, ఫారం- బీ సమర్పించకపోవడంతో ఆయన నామినేషన్ తిరస్కరించారు. మొత్తం 27నామినేషన్లలో నాలుగు తిరస్కరణకు గురికాగా, 23 నామినేషన్లు ఆమోదించినట్లు రిటర్నింగ్ అధికారి రవిశంకర్ రెడ్డి వెల్లడించారు.

సత్యవేడులో ఏడు..

సత్యవేడు, ఏప్రిల్ 26: సత్యవేడు అసెంబ్లీ స్థానానికి 24 మంది నామినేషన్లు దాఖలు చేయగా పరిశీలనలో ఏడు నామినేషన్లను తిరస్కరించినట్లు రిటర్నింగ్ అధికారి నరసింహులు తెలిపారు. శుక్రవారం సత్యవేడు తహసీల్దార్ కార్యాలయంలో అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ల పరిశీలన జరిపారు. వివిధ కారణాలతో ఏడింగిని తిరస్కరించారు. 17 మంది నామినేషన్ పత్రాలన్నీ సవ్యంగా ఉండడంతో ఆమోదించినట్లు రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు.

రౌడీయిజాన్ని ఉపేక్షించం: సుధీర్ రెడ్డి



సుధీర్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న టింబర్ డిపోల యజమానులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 26: శ్రీకాళహస్తిలో రౌడీయిజాన్ని రూపుమాపుతామని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని టింబర్ డిపోలు, త్రోవుడు మిల్లర్లు, పలువురు ప్రముఖ వ్యాపారులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పలువురు వ్యాపారులు ఐదేళ్ల వైసీపీ పాలనలో తాము ఎదుర్కొన్న దౌర్జన్యాలపై ఆవేదన వ్యక్తం చేశారు. సొంత పార్టీ నేతలపైనే దాడి చేశారని కొందరు వాపోయారు. సుధీర్ రెడ్డి మాట్లాడుతూ...తన తండ్రి, మాజీ మంత్రి గోపాలకృష్ణారెడ్డి ప్రశాంతతకు మారుపేరుగా శ్రీకాళహస్తిని అభివృద్ధి చేశారని, అందుకే ఐదుసార్లు ప్రజలు ఆదరించాలని గుర్తు చేశారు. తండ్రి తరహాలోనే రౌడీయిజంపై ఉక్కు పాదం మోపుతానని వ్యాపారులకు భరోసా ఇచ్చారు. అనంతరం పట్టణంలోని 24వ వార్డు పరిధిలో కూటమి నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి సుధీర్ రెడ్డిని, కమలం గుర్తుపై ఓటు వేసి ఎంపీ అభ్యర్థి వరప్రసాద రావును గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయ్ కుమార్, కంఠా రమేష్, మునికృష్ణ, బీజేపీ నేత అమర్నాథ్ పాల్గొన్నారు.

తొట్టంబేడు: మండలంలోని బోనుపల్లి, కంచనపల్లి, కారాకొల్లు, చిట్టత్తూరు గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నీతివంతమైన పాలన కోసం టీడీపీని గెలిపించాలని ప్రజలను కోరారు. భూదందాలు, ఇసుక మాఫియాతో అక్రమంగా సంపాదించిన డబ్బుతో ప్రజలను మభ్యపెట్టి ఎన్నికల్లో గెలవాలని ప్రయత్నిస్తున్న అధికార పార్టీ ఎమ్మెల్యేకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమెల్యే ఎస్సీవీ నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, నాయకులు మురళీ నాయుడు, జయచంద్ర నాయుడు, వెంకటాచలం, భాస్కర్ నాయుడు, లెక్కల మురళీ నాయుడు, బాలాజీరెడ్డి, చంద్రారెడ్డి, కన్నలి ప్రతాప్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని అక్కుర్తి దళితవాడకు చెందిన వైసీపీ నాయకులు నరేంద్ర, పవన్, లాలూ ప్రసాద్, బాలు, సాయి, గంగాధరం, మధు టీడీపీలో చేరారు. వారికి సుధీర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటసుబ్బారెడి, తాటిపర్తి రవీంద్రనాథ్‌రెడ్డి, జయకృష్ణ యాదవ్, నాగార్జున్‌రెడ్డి, సురేంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో సుధీర్‌రెడ్డి

ఎంపీగా మరోసారి అవకాశం ఇవ్వండి: వరప్రసాద్



టీడీపీ నాయకుడు మన్నారపు వెంకటరత్నయ్యతో మాట్లాడుతున్న వెలగపల్లి వరప్రసాద రావు - చెన్నూరు దళితవాడలో స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వెలగపల్లి

బాలాయపల్లి/గూడూరు, ఏప్రిల్ 26: తిరుపతి ఎంపీగా ఒకసారి పనిచేసిన అనుభవం ఉందని అప్పట్లో తాను చేసిన అభివృద్ధే ఇప్పటికీ కనబడుతోందని మరోసారి తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు అన్నారు. శుక్రవారం బాలయపల్లి మండలం జయంపు గ్రామంలో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. తాను ఎప్పుడు అందుబాటులో ఉంటానని సమస్యలను పరిష్కరించడంలో ముందుంటానన్నారు. అనంతరం టీడీపీ నాయకుడు మన్నా రపు వెంకటరత్నయ్య ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. తన గెలుపునకు సహకరించాలని కోరారు. ఏ అవసరం వచ్చినా తాను అందుబాటులోఉంటానని హామీ ఇచ్చారు.

గూడూరు అభివృద్ధికి ఎంతో కృషి...

గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు ఎన్నో సమస్యలను పరిష్కరించానని ఎంతో అభివృద్ధి చేశానని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం సాయంత్రం గూడూరు మండలం చెన్నూరు గ్రామంలో దళితవాడలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దళితుల సమస్యల పట్ల తాను చిత్తశుద్ధితో పనిచేస్తానని చెప్పారు. అనంతరం గూడూరు పట్టణంలో టీడీపీ, జనసేన నాయకులతో భేటీ అయ్యారు. కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు.

హెడ్ కానిస్టేబుల్ మృతి



శ్రీధర్(ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 26: శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీధర్(50) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం ఇంటి వద్ద తదిశ్వాస విడిచారు. శ్రీధర్ మృతి పట్ల పోలీస్ అధికారులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. శనివారం పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

కుటుంబ కలహాలతో యువతి ఆత్మహత్య

వరదయ్యపాళెం, ఏప్రిల్ 26: మండలంలో శుక్రవారం ఓ యువతి(18) ఆత్మహత్య చేసుకుంది.వరదయ్యపాళేనికి సమీపంలో వున్న గోవర్ధనపురంలో కుటుంబ కలహాలతో ఓ యువతి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుంది. తర్వాత గమనించిన కుటుంబసభ్యులు శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే ఆమె అప్పటికే మరణించిందని వైద్యులు నిర్ధారించారు.

రేణిగుంటలో టీడీపీ ప్రచారం



పాంచాలినగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న రిషితారెడ్డి

రేణిగుంట, ఏప్రిల్ 26: రేణిగుంట పట్టణంలో పాంచాలినగర్‌లో ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపతారలు అందజేసి సుధీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

విద్యార్థినికి జ్ఞాపిక అందజేత

ఏర్పేడు, ఏప్రిల్ 26: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపి 592 మార్కులు సాధించిన ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని జననీకి శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన సత్రవాడ ప్రవీణ్‌కుమార్ జ్ఞాపిక అందజేశారు.

శ్రీసిటీలో గ్రంథాలయం, క్రికెట్ మైదానం ప్రారంభం

శ్రీసిటీ, ఏప్రిల్ 26: సామాజిక వసతుల కల్పనలో భాగంగా శ్రీసిటీలో నూతనంగా కమ్యూనిటీ గ్రంథాలయం, క్రికెట్ మైదానాన్ని ప్రారంభించారు. శుక్రవారం ఉదయం స్థానిక క్రికెట్ సైడ్ నివాస సముదాయం సమీపంలోని షాపింగ్ ఆర్కేడ్ రెండో అంతస్తులో లాంఛనంగా పూజలు చేసి గ్రంథాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో చిన్మయ విద్యాలయ ట్రస్టీ ఓవీ నంబియార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలాగే స్థానిక జ్ఞాన్ సర్కిల్ సమీపంలో ఏర్పాటు చేసిన క్రికెట్ మైదానాన్ని శ్రీసిటీ ప్రెసిడెంట్(ఆపరేషన్స్) సతీష్ కామత్ ప్రారంభించారు. గతంలో శ్రీసిటీలోని ఇన్ అతిథి గృహం సమీపంలో గోల్ఫ్ కోర్స్ మైదానాన్ని నెలకొల్పారు.

ఉపరాష్ట్రపతికి వీడ్కోలు



ఉపరాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

రేణిగుంట, ఏప్రిల్ 26: ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శుక్రవారం ఉదయం ఉపరాష్ట్రపతి ఒకరోజు పర్యటనలో భాగంగా ఢిల్లీ నుంచి కుటుంబసభ్యులతో కలిసి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. వీరికి గవర్నర్ అబ్దుల్ నజీర్, అడిషనల్ డీజీపీ(సీఐడీ) సంజయ్, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, ఆర్డీవో పెంచలకిషోర్, సంస్కృత యూనివర్శిటీ ఉపకులపతి కృష్ణమూర్తి స్వాగతం పలికారు. తిరుమల, తిరుపతి పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 3.15గంటలకు రోడ్డు మార్గాన రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఉపరాష్ట్రపతికి అధికారులు వీడ్కోలు పలికారు. అలాగే గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జేసీ ధ్యానచంద్ర, ప్రోటోకాల్ అధికారి భాస్కర్ నాయుడు వీడ్కోలు పలికారు.

హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు స్వాగతం



చీఫ్ జస్టిస్‌కు స్వాగతం పలుకుతున్న న్యాయమూర్తులు

రేణిగుంట, ఏప్రిల్ 26: ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ రఘునందన్‌రావుకు రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శుక్రవారం సాయంత్రం విజయవాడ నుంచి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న వీరికి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జేసీ ధ్యానచంద్ర, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, ఉమ్మడి జిల్లా జడ్జీలు స్వాగతం పలికారు.

టీడీపీలో చేరిక

నారాయణవనం, ఏప్రిల్ 26: రాక్షస పాలన కొనసాగిస్తున్న వైసీపీ ప్రభుత్వం నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుందదామని జడ్పీటీసీ సుమన్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని భీముని చెరువు పంచాయతీ చెందిన వైసీపీ యువత టీడీపీలో చేరారు. వారికి సుమన్‌కుమార్ కండవాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో ప్రేమ్‌కుమార్, శ్రీరాములు, శంకర్, వడివేలు, రామూర్తి, దొరబాబు, షైఖిల్, లోకనాధం తదితరులు ఉన్నారు.

పుత్తూరు వార్తలు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మోనిష్ (ఫైల్ ఫొటో)

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 26: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన పుత్తూరులో జరిగింది. స్థానికుల కథనం మేరకు.... పట్టణంలోని దెయ్యాలగుంట వీధికి చెందిన ఎస్.మోనిష్(22) హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేసి అవ్వాతాతల వద్ద ఉంటున్నాడు. తండ్రి వెంకటేశ్వర్లు వృత్తి రీత్యా బెంగుళూరులో ఉంటున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా శివాలయం ఎదురుగా ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి చిత్తూరు వైపు వెళుతున్న లారీ కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మోనిష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేడుకగా పద్మావతమ్మ ఊంజలసేవ

నారాయణవనం, ఏప్రిల్ 26: నారాయణవనంలో వెలసిన కళ్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామి, పద్మావతి అమ్మవార్లకు శుక్రవారం సందర్భంగా ఉదయం నిత్య కైంకర్యాలు నిర్వహించి, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణతో ఊంజల సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయాధికారి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించండి

వడమాలపేట, ఏప్రిల్ 26: రాష్ట్రంలో సుస్థిరత సాధించాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆ పార్టీ నగరి అభ్యర్థి రాకేష్ రెడ్డి కోరారు. శుక్రవారం వడమాలపేట మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ప్రచారంలో నాయకులు పురుషోత్తం రెడ్డి, చిరంజీవి, రత్నం, కేశువులు, కుమార్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో ప్రజలే గెలవాలి : భానుప్రకాష్



జీఎంపురంలో మాట్లాడుతున్న గాలి భానుప్రకాష్

నగరి ఏప్రిల్ 26: త్వరలో జరిగే ఎన్నికల్లో ప్రజలు గెలవాలని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో నగరి మండలం, పట్టణ పరిధిలోని మహిళల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మహిళాసాధికారిత కోసం నాడు డ్వాక్రా గ్రూపులను ప్రారంభించారని గుర్తుచేశారు పూర్వం సామంతురాజులుండేవారని, ఆలా నగరి నియోజకవర్గంలో రోజా ఒక్కో మండలాన్ని తన అన్నదమ్ముళ్లు, భర్తకు అప్పగించి కొండలను పిండి చేసి దండుకున్నారని, ఇసుక తోడేశారని, గంజాయి అమ్మకాలతో యువత భవిష్యత్ నాశనం అయ్యేలా చేశారని విమర్శించారు. మిమ్మల్ని మీరు కాపాడుకోవాలంటే సైకిల్ గుర్తుకు ఓటేసి తెలుగుదేశం పార్టీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మీరాకుమారి, కృష్ణవేణి, భానుమతి, సుజాత, సంధ్య, నాయకులు బాలాజీ, వంశీ, చిట్టి. శివకుమార్‌రెడ్డి, రమేష్, పురుషోత్తం, నారాయణ, మధు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

విజయపురం: వైసీపీని ఇంటికి సాగనంపాలని గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం గంగమాంబాపురం, కాళికాపురం, కేవీశ్రీరామాపురం, కేవీపురం ఎం.అగరం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. జీఎంపురంలో 20 మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి చిన బాబు పాల్గొన్నారు.

పుత్తూరు అభివృద్ధి కోసం భానుప్రకాష్‌ను గెలిపించండి



ఆరేటమ్మ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 26: పుత్తూరు అభివృద్ధి కోసం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను గెలిపించాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ గాలి జీవరత్నంనాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం 22వ వార్డు పరిధిలోని ఆరేటమ్మ కాలనీ, ఎస్‌బీఐ కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో దౌర్జన్యాలు, అరాచకాలు, అక్రమాలు, అవినీతి తప్ప అభివృద్ధి పనులు ఒక్కటైనా జరిగిందా అని నిలదీశారు. పట్టణంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, సమస్యలపై పోలీసు కేసులు పెట్టి వేధించారని ధ్వజమెత్తారు. టీడీపీ హయాంలో 90 శాతం పూర్తైన టిడ్కో ఇళ్లను మిగిలిన పదిశాతం పనులు పూర్తి చేసి పేదలకు అందించకుండా కాలయాపన చేశారని విమర్శించారు. వైసీపీ అరాచకాలు ముగింపు పలకాలంటే ఎమ్మెల్యేగా గాలి భానుప్రకాష్‌ను, ఎంపీగా దగ్గుమళ్ల ప్రసాద్‌రావును గెలిపించాలని కోరారు.

బీసీల్లో మార్పు తథ్యం

వడమాలపేట, ఏప్రిల్ 26: అధికారంలోకి రాగానే 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామన్న టీడీపీ చేసిన ప్రకటనతో బీసీల్లో మార్పు తథ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జానా వెంకటయ్య చెప్పారు. శుక్రవారం సీతారామపురం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. నగరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గాలి భానుప్రకాష్‌ను గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దేవానంద నాయుడు, ధనంజయులు నాయుడు, దేవ, ఉమాపతిరావ్, భాస్కర్ నాయుడు, శోభనాద్రి యాదవ్, హరినాయుడు, వెంకటేశ్వరరావ్, గురవయయ, పార్థసారధి నాయుడు, దిలీప్, మోహన్, మధు, వెంకటేష్, రవినాయుడు, లక్ష్మీనారాయణ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



సీతారామపురంలో కరపత్రం అందిస్తున్న నాయకులు